

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
బుధవారం | నవంబర్ 15, 2023 | www.navatelangana.com

వారసత్వం కలిసొచ్చేనా?

- ఉద్దండులైన తాత, తండ్రుల వారసత్వంతో ముగ్గురు న్యూ ఎంట్రీ
- అసెంబ్లీ ఎన్నికల పోరులో తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి...
- వీరి ప్రత్యర్థులు సీనియర్లు.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నవారే!
- కోరుట్లలో డాక్టర్ సంజయ్‌కి సిట్టింగ్ ఎమ్మెల్యేగా తండ్రి పాలనాంశాలే ప్రచారాస్త్రాలు
- హుజూరాబాద్‌లో ప్రణవ్‌బాబుకు సుదీర్ఘ రాజకీయ కుటుంబ నేపథ్య బలం
- చివరిక్షణంలో బీఫామ్ అందుకున్న వికాస్‌రావును వెంటాడుతున్న ప్రతికూలతలు




ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి మూడు స్థానాల్లో కొత్తగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన ముగ్గురు వారసులు ప్రత్యక్షరాజకీయాల్లో గెలుపును పరీక్షించుకుంటున్నారు. ఎలాంటి రాజకీయ అనుభవమూ లేకున్నా.. ఉద్దండులైన తాత, తండ్రి వారసత్వం బలంతోనే ఎన్నికల పోరులో అడుగుపెట్టారు. అందులోనూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్లతోనే తలపడుతున్నారు. కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కి హ్యాట్రిక్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న తన తండ్రి పాలనాంశాలు, ప్రభుత్వ పనితీరు ప్రచారాస్త్రాలుగా ఉండగా.. హుజూరాబాద్‌లోని కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్‌బాబుకు సుదీర్ఘ రాజకీయ కుటుంబ నేపథ్యం, కాంగ్రెస్ హవా బలమైన అంశాలుగా ఉన్నాయి. ఎటొచ్చీ.. వేములవాడ బీజేపీ అభ్యర్థిగా లిస్టులో పేరు ప్రకటించకపోయినప్పటికీ చివరి నిమిషంలో 'బీఫామ్' అందుకున్న వికాస్‌రావుకు నియోజకవర్గంలో బలంగాలేని పార్టీ, టికెట్ రాక భంగపడ్డ తుల ఉమ ఉదంతం ప్రతికూలాంశాలుగా వెంటాడుతున్నాయి.

\- నవతెలంగాణ, కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

మిగతా 2లో...

2021 ఉప ఎన్నిక తెచ్చిన చేటు

- పొద్దంతా పార్టీ ప్రచారాలు
- తెల్లందాకా బుజ్జగింపులు
- వాళ్లిద్దరు కొట్టుకుంటే.. నేనే గెలుస్తా..
- హుజూరాబాద్‌లో ఎవరి ధీమా వారిదే



నవతెలంగాణ - జమ్మికుంట

హుజురాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా వొడితల ప్రణవ్ బాబు, బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు. బీఎస్పీ నుంచి పల్లె ప్రశాంత్ గౌడ్ బరిలో ఉన్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్య హోరాహోరీ ప్రచారం, పోటీ ఉంది. 2021లో అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు, సీఎం కేసీఆర్‌కు మధ్య విభేదాలు ఎందుకు వచ్చాయో ఇప్పటివరకు అసలు విషయం వారిద్దరూ కూడా నోరు మెదపలేదు. అసైన్డ్ భూములను ఈటల ఆక్రమించాడు అనే పేరుతో మాత్రమే బయటికి పంపించారని ప్రచారం జరిగింది.

ఆ తర్వాత ఈటల బయటకు రావడం తదనంతరం బీజేపీ పార్టీలో చేరడం, ఆ పార్టీ తరపున 2021లో పోటీ చేయడం, ఆ పోటీని సీఎం కేసీఆర్ అతి ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం, తెలంగాణ రాష్ట్ర మంత్రులు, యంత్రాంగం హుజురాబాద్ నియోజకవర్గంలో ఉండి, బీజేపీ తరఫున పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌ను ఓడించడానికి తన సర్వశక్తులను ఉపయోగించాడు అనడంలో ఎలాంటి సంశయము లేదు.

అప్పటివరకు వాస్తవంగా నియోజకవర్గము ఏర్పడినప్పటి నుంచి అసెంబ్లీ ఎన్నికలలో డబ్బుల పంపిణీ కానీ మద్యం పంపిణీ గాని చేసిన సందర్భం చాలా తక్కువ. 2023జనరల్ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా2021 ఉప ఎన్నిక లాగానే డబ్బుల పంపిణీ ఉంటుందని నియోజకవర్గంలో

మిగతా 2లో...



ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సిఆర్ ప్రసన్న కుమార్

నవతెలంగాణ - భగత్‌నగర్ : స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సిఆర్ ప్రసన్న కుమార్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్‌లు డాక్టర్ సిఆర్ ప్రసన్న కుమార్, ఎంఆర్ రవి కుమార్‌లు పాల్గొని మాట్లాడారు. జరగబోయే అసెంబ్లీ సాధారణ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు, మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, మైక్రో

మిగతా 2లో...

యువతకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

- సంజయ్ ఆరోపణలు అబద్ధాలు
- ఆరోపణలు నిరూపించాలి.. లేకుంటే ప్రచారాన్ని అడ్డుకుంటాం
- బీఆర్ఎస్ కె మేయర్, డిప్యూటీ పదవులు
- బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్

మిగతా 2లో...

నవతెలంగాణ 2
కరీంనగర్
బుధవారం | నవంబర్ 15, 2023 | www.navatelangana.com

2021 ఉప ఎన్నిక తెచ్చిన చేటు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నటువంటి కొంతమంది ఊహించుకొని ఉన్నారు. ఏది ఏమైనా నోటుకు ఓటు పోయి స్వచ్చందంగా సమాజానికి నిస్వార్థంగా, నిజాయితీగా, అవినీతి లేకుండా అక్రమార్చన లేకుండా ఉండేటువంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించుకునేటువంటి గొప్ప ఆయుధం ఓటు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఓటును సద్వినియోగం చేసుకొని వేస్తే సమాజాభివృద్ధి జరుగుతుంది. తాత్కాలిక ప్రయోజనాలను అంటే మద్యము, డబ్బులకు, లేదా దగ్గర, కులము, మతము, తెలిసినవాడు అని, సమాజ సేవ చేయకుండా స్వార్థపరునికి ఓటు వేస్తే 5 సంవత్సరాలు వాడు చేసే దుర్మార్గాలను, దౌర్జన్యాలను, అక్రమాలను, అవినీతిని, భూ కబ్జాలను భరించాల్సిందే.

మొదలైన బుజ్జగింపుల పర్వం..

నియోజకవర్గంలో వీణవంక, జమ్మికుంట, హుజురాబాద్, ఇల్లందకుంట, కమలాపూర్ ఐదు మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో ఉన్నటువంటి కొంతమంది సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల సీనియర్ నాయకులు అలకభూని పార్టీ ఆదేశాను సారము పనిచేయకుండా ఇంట్లో ఉండి అలక భూనారు. కొంతమంది ప్రజాప్రతినిధులు ,ఆయా పార్టీల సీనియర్ నాయకులు ఏదో ఓ సందర్భంలో మనసు నో చ్చు కొని లేదా తమ కంటే జూనియర్లకు లేదా ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని అలిగి ఇంట్లో ఉండగా వారందరి లిస్ట్ తీసుకొని బుజ్జగింపుల పర్వం మొదలుపెట్టారు.

ఉదయమంతా పార్టీల ప్రచారం చేస్తూ రాత్రంతా అలిగిన నాయకులను, ప్రజాప్రతినిధులను ఓదార్చుతూ నేను మీకున్న ,నన్ను గెలిపించండి. నేను గెలిస్తే రాబోయే ఎన్నికల్లో ఈ పదవిలో పెట్టి గెలిపిస్తా లేదా ఫలానా నామినేట్ పదవి ఇస్తానని హామీ లిస్టు ఓదార్చుతున్నట్టు సమాచారం.

విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ..

2021 హుజురాబాద్ ఎన్నిక సందర్భంగా విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేశారని ఒక పార్టీపై, మరొక పార్టీ ఆరోపణలు చేసుకున్నారు. మద్యం ఏరులై పారింది. భారతదేశంలోని అతి ఖరీదైన ఎన్నికగా పేరుంది.

నాయకుల స్థాయిని బట్టి రేటు..

2021ఉప ఎన్నికలో నియోజకవర్గంలో ఉన్నటువంటి నాయకులు స్థాయిని రేటు నిర్ణయించి డబ్బుల పంపిణీ యథేచ్ఛగా పంపిణీ చేసినట్లు సమాచారం. 2023 నవంబర్లో జరిగే ఎన్నికల్లో కూడా ఆ పరిస్థితి పునరావృతం అవుతుందని కొంతమంది నాయకులు, ప్రజాప్రతినిధులు ఎన్నికల నోటిఫికేషన్ రాగానే ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆ ఎన్నిక గుణపాఠంగా తీసుకొని ఆయా రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసే అభ్యర్థులు అందుకు భిన్నంగా డబ్బుల పంపిణీ చేయకపోవడంతో ఆశలు పెంచుకున్నటువంటి నాయకులు ఎప్పుడు ఆయా పార్టీల నుంచి పిలుపు వస్తుందోనని ఎదురు చూస్తున్నట్లు సమాచారం.

ఎవరి ధీమా వారిదే..

ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి పార్టీల అభ్యర్థులు వారి గెలుపునే ధ్యేయంగా ప్రచారం చేస్తున్నారు. వారి వారి పార్టీల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. వ్యక్తిగతంగా నియోజకవర్గంలో ఉంటూ సమాజ సేవ చేస్తామని హామీలు ఇస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పథకాలను దృష్టిలో పెట్టుకుంటే ప్రభుత్వ లబ్ధిదారుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. కానీ వీరందరి ఓటు ఏ పార్టీకి పడుతుందనే చర్చ నియోజకవర్గంలో కొనసాగుతోంది.

వారసత్వం కలిసొచ్చేనా?

(మొదటిపేజీ తరువాయి)

వేములవాడలో వికాస్‌రావు గెలుపు కష్టమే!

మాజీ గవర్నర్, సీనియర్ నేత విద్యాసాగర్‌రావు కుమారునిగా ఈ ఎన్నికల్లో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన వికాస్‌రావు ఏడాది కిందటి నుంచి ఓ స్వచ్ఛంద సంస్థ తరుపున సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఇటీవలే ప్రత్యక్ష రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. బీజేపీ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకుని ప్రచారమూ ప్రారంభించారు. అప్పటికే ఆ స్థానంలో కర్చీఫ్ వేసుకుని అభ్యర్థుల లిస్టులో పేరూ సంపాదించుకున్న సీనియర్ నాయకురాలు తుల ఉమకు 'బీఫామ్' అందకుండా తెరవెనుక రాజకీయం నడిపారు. తండ్రి రాజకీయ పలుకుబడి, తనకు మద్దతుగా నిలిచిన కరీంనగర్ ఎంపీ సంజయ్ అండతో నామినేషన్ చివరి రోజున అదీ... లాస్ట్‌మినిట్‌లో 'హెలికాప్టర్' ద్వారా 'బీఫామ్' అందుకుని అక్కడి బీజేపీలో సంచలనం రేపారు. అభ్యర్థిత్వం ఖరారై బీఫామ్ అందక భంగపడ్డ తుల ఉమ భగ్గుమన్నారు. కన్నీటిపర్యంతమవుతూ పార్టీ అధిష్టానాన్ని దునుమాడారు. వేములవాడలో 'బీజేపీ ఎలా గెలుస్తుందో చూస్తా' అంటూ సవాల్ విసిరి మరీ వెనువెంటనే గులాబీ పార్టీలో చేరిపోయారు. ఆ పార్టీ అభ్యర్థి 'చలిమెడ'కు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో అసలే బలహీనంగా ఉన్న పార్టీలో రెబల్‌గా మారిన తుల ఉమ ఉదంతం ప్రతికూలంగా మారింది. సుదీర్ఘంగా ఐదుసార్లు స్వల్పఓట్ల తేడాతోనే రెండో స్థానంలో నిలుస్తూ వస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ ఓ వైపు... క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనర్సింహరావు మరోవైపు నువ్వా.. నేనా? అని తలపడుతుండగా.. వికాస్‌రావు పోటీనిచ్చే పరిస్థితులు కనిపించకపోవడం గమనార్హం.

కోరుట్ల బరిలో ముగ్గురూ వారసులే...

కోరుట్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ముగ్గురూ వారసత్వ రాజకీయాల నుంచి వచ్చిన వారేకావడం గమనార్హం. బీఆర్ఎస్ నుంచి పోటీకి దిగిన డాక్టర్ సంజయ్ మాత్రం ఈ ఎన్నికల్లోనే కొత్తగా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2009 నుంచి (ఒక ఉప ఎన్నిక కలుపుకుని) వరుసగా నాలుగుసార్లు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిచిన కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు కుమారునిగా, ప్రముఖ వైద్య నిపుణునిగా మాత్రమే సంజయ్ నియోజకవర్గ ప్రజలకు సుపరిచుతులు. ఈ తొమ్మిది న్నరేండ్ల ప్రభుత్వ పాలన, ఇన్నేండ్ల తండ్రి రాజకీయ నేపథ్యంపైనే ఆశలు పెట్టుకుని బరిలోకి దిగిన సంజయ్‌కి ప్రత్యర్థిగా మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు తనయుడు నర్సింగరావు బలమైన అభ్యర్థిగా బరిలో ఉన్నారు. వరుస ఓటమితో వచ్చిన సానుభూతి, కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రచారంలో దూసుకుపోతున్న నర్సింగరావుతోనే పోటీ నెలకొనగా.. 'సందంట్లో సడేమియా' అన్న చందంగా నిజామాబాద్‌కు చెందిన ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈసారి అసెంబ్లీకి పోటీ చేసేందుకు కోరుట్ల నుంచి బీజేపీ తరుపున బరిలోకి దిగారు. 'గెలిచిన మూన్నెళ్లలోనే పసుపుబోర్డు తెస్తా' అంటూ బాండ్‌పేపర్ రాసిచ్చి ఫెల్యూర్ అయ్యారనే అపవాదు మూటగట్టుకున్న అర్వింద్‌కు కోరుట్లలో స్థానికేతరుడనే భావనా జనంలో నెలకొంది. మరోవైపు తన పార్లమెంట్ పరిధిలోనే ఉన్న కోరుట్లకు ఎంపీగా తాను తీసుకొచ్చిన పరిశ్రమలుగానీ, చేసిన పనిగానీ లేకపోవడం ప్రతికూలాంశాలుగా ఉన్నాయి. ఇక్కడ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే పోటీ నెలకొననుంది.

హుజూరాబాద్‌లో త్రిముఖపోటీ..

హుజూరాబాద్ నియోజకవర్గంలో ఈసారి త్రిముఖ పోటీ నెలకొననుంది. ఇక్కడి నుంచి వరుసగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఈటల రాజేందర్ ప్రధాన బలమైన అభ్యర్థిగా ఉన్నారు. అయితే ఇన్నేండ్లు గెలుపునంతా బీఆర్ఎస్ పార్టీలో ఉండగా అందుకున్నది కావడం గమనార్హం. ఆ పార్టీలో వచ్చిన పొరపొచ్చాలతో బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరిన 'ఈటల' తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో బీజేపీ తరుపున అతికష్టం మీద గెలుపును అందుకున్నారు. ప్రస్తుతం మళ్లీ బీజేపీ నుంచే బరిలోకి దిగారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పోటీలో ఉండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా సుదీర్ఘరాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వొడితెల ప్రణవ్‌బాబు రంగంలోకి దిగారు. సుదీర్ఘరాజకీయనేపథ్యం, ఆర్థికంగా స్థిరపడిన కుటుంబం నుంచి వచ్చిన ప్రణవ్‌బాబు తొలుత బీఆర్ఎస్‌లోనే ఉన్నారు. ఈ సారి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గానే పోటీ నెలకొన్న ఈ నియోజకవర్గంలో ఈసారి బలమైన అభ్యర్థి బీజేపీ తరుపున నిలిచారు. అయినప్పటికీ రాష్ట్రంలో బీజేపీ గాలిలేకపోవడం ఈటలకు ప్రతికూలంగా మారింది. బీఆర్ఎస్‌లోని 'పాడి'కి వ్యతిరేకవర్గమూ క్రమంగా బలపడి కాంగ్రెస్‌లో చేరింది. బీజేపీలో ఇముడలేక బయటకొచ్చినవారూ కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. ఈ పరిణామాలు మొదట్నుంచీ గ్రామస్థాయిలో ఉన్న 'హస్తం' కేడర్‌కు మరింత బలాన్ని చేకూర్చినట్టయింది. దీంతో హుజూరాబాద్‌లో బరిలో బలమైన ప్రత్యర్థులుగా పాడి, ఈటల ఉన్నప్పటికీ వారికి పోటీగా రంగంలోకి దిగిన ప్రణవ్‌బాబూ టఫ్ ఫైట్‌నే ఇవ్వనున్నారనే చర్చ నియోజకవర్గంలో సాగుతోంది.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

(మొదటిపేజీ తరువాయి)

అబ్జర్వర్లు వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తునే పోలింగ్ బృందంతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి పమేల సత్పతి మాట్లాడుతూ మైక్రోఅబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి కళ్లు, చెవుల వంటి వారని, గతంలో జరిగిన ఎన్నికలలో హింసాత్మక సంఘటనలు, బెదిరింపులకు పాల్పడడం, నిర్దిష్ట అభ్యర్థికి అనుకూలంగా అసాధారణంగా అధిక ఓటింగ్ జరిగడం మొదలైన వాటి ఆధారంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తామని, పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్‌లు, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ, స్టిల్ ఫోటోగ్రఫీ మొదలైన వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు పద్మావతి, సదానందం, ఎల్లియం ఆంజనేయులు పాల్గొన్నారు.

యువతకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

బీఆర్ఎస్ నగర అధ్యక్షులు చల్లహరిశంకర్



నవతెలంగాణ - కరీంనగర్ : యువత మాదక ద్రవ్యాలకు అలువాటు పడ్డారని యువతను కించపరిచేలా ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడారని వెంటనే యవతకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నగర్ అధ్యక్షులు చల్లహరిశంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని 37వ డివిజన్ మీసేవా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014, 2018, 2019 ఎన్నికల్లో యువత బండి సంజయ్ వెంటే ఉన్నారని గంజాయికి బానీస చేశావా అని ప్రశ్నించారు. యువతను వంచించి, వారిని కేసుల్లో ఇరికించి, యువకుల జీవితాలతో చెలగాటమాడారని ఆరోపించారు. నాడు బండి సంజయ్ వెంట ఉన్న యువకులు, ఇప్పుడు నీ మాటలు నమ్మకుండా మంత్రి గంగుల సమక్షంలో బీఆర్ఎస్‌లో పెద్ద ఎత్తున చేరుతుంటే తట్టకోలేక యువకులపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ సిటీ తెచ్చిన ఘనత బోయినిపల్లి వినోద్ కుమార్ దైతే, అది తన ఘనతే అని బండి చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి అప్లికేషన్ పెట్టింది, మంజూరు చేయించింది బోయినిపల్లి వినోద్ కుమారే అన్నారు. బండి రైల్వే ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపనకు రాకుండా ముఖం చాటేశాడన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై తాము బహిరంగ చర్చకు ఇప్పటికీ సిద్ధంగా ఉన్నామన్నారు. భార్య పుస్తెలు అమ్ముకున్న బండికి ఇప్పుడు వందల కోట్లు ఎలా వస్తున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. 2020 నుంచి 2023వరకు ఆయన ఆస్తులు ఎలా పెరిగాయో చెప్పాలన్నారు. మంత్రి గంగుల మరోసారి గెలిస్తే కరీంనగర్‌లో హిందువులు బొట్టు ధరించడం, కంకణం కట్టుకోలేని పరిస్థితులు వస్తాయని అనడం దారుణం అన్నారు. బండి సంజయ్ పుట్టకముందే కరీంనగర్లో దేవాలయాలు ఉన్నాయనే సంగతి మరచిపోవద్దని ధ్వజమెత్తారు. గత ఆరు సంవత్సరాలుగా కరీంనగర్లో శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణతో పాటు... టిటిడి ఇస్కాన్ దేవాలయాలను నిర్మిస్తున్న పెద్ద హిందువు గంగుల కమలాకర్ అని కొనియాడారు. హిందువని చెప్పుకుంటున్న నువ్వు ఎక్కడైనా ఒక ఆలయ అభివద్ధికి రూపాయి ఇచ్చావా అని ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే బండి సంజయ్ ప్రచారాన్ని అడ్డుకొని నిలదీస్తామని స్పష్టం చేశారు. తన మాటలు ఎవరు పట్టించుకోవడంలేదని మున్సిపల్ మేయర్ పదవి ఎంఐఎంకేనని అబద్ధపు ప్రచారానికి తెర తీశారన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి



నవతెలంగాణ - భగత్‌నగర్ : బాలల హక్కులను పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు హనుమాన్ల శోభారాణి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శోభారాణి మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడే బాధ్యత కేవలం కమిషన్ పైనే కాకుండా ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బాలల కోసం జిల్లా స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ పనిచేస్తున్నదని తెలిపారు. ఆపదలో ఉన్న చిన్నారులను కాపాడేందుకు జిల్లాలో చైల్డ్ లైన్1098కు ఫోన్ చేయడం ద్వారా వారికి సత్వర సహాయం అందుతుందని తెలిపారు. సిడబ్ల్యుసి చైర్ పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగిన పిల్లల ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. పిల్లలు ఎలాంటి దుష్ప్రభావాలకూ అలవాటు పడకుండా తల్లిదండ్రులు, సంరక్షకులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కళింగ శేఖర్, రాధ, అర్చన, జిల్లా బాలికల అభివద్ధి అధికారి కృపారాణి, డీసీపీవో శాంత, బాలభవన్ సూపరింటెండెంట్ మంజుల, సఖి అడ్మిన్ లక్ష్మి, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ సంపత్, ఏసీడీపీవో అరవింద పాల్గొన్నారు.

సివిల్ సప్లై కమిషనర్ ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - తిమ్మాపూర్ : మండలంలోని రేణికుంట గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని సివిల్ సప్లై కమిషనర్ హైదరాబాద్ వి.అనిల్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు తనిఖీలో భాగంగా కమిటీ సభ్యులు నాణ్యత ప్రమాణాలను పాటించి, సకాలములో ధాన్యాన్ని కొనుగోలు నిర్వహించాలని చెప్పారు.అలాగే రైతులకు సకాలములో డబ్బులుచెల్లించే విధంగా అధికారుల ఆదేశించారు. ఈ తనిఖీలలో సివిల్ సప్లై కమిషనర్ తో పాటు జనరల్ మేనేజర్ రాజిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారులు సురేష్, జిల్లా మేనేజర్ రజనీకాంత్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, ఏపీఎం రాజేశం డిప్యూటీ తహసిల్దార్ వేణుగోపాల్, సిసి రాజేందర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం



నవతెలంగాణ - భగత్‌నగర్ :

కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామంలోని ఎస్సీఆర్ స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. బాలల దినోత్సవ సందర్భంగా ఎస్‌పీఆర్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ బి.ఉపేందర్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఉపాధ్యాయులు దేశనాయకుల వేషధారణలతో హాజరయ్యి విద్యార్థులకు వారి ఔన్నత్యాన్ని తెలియజేసారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఆర్ స్కూల్ చైర్మన్ డాక్టర్ విజయ మోహన్ రెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ యాకయ్య, ప్రిన్సిపల్ చొక్కారావు, డాన్స్ టీచర్ డి.రామకృష్ణ, ఉపాధ్యాయులు రాజు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పట్టణంలోని ఆరో వార్డులో కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి పట్టణంలోని ఆరో వార్డులో చొప్పదండి యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కనుమల్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేపట్టిన ఆరుగ్యారంటీ పథకాలను గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యంను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇరుకుల్ల సంతోష్, నల్లాల అఖిల్, తాండ్ర వేణుగోపాల్, బండారి అఖిల్, లక్ష్మణ్, ఓంకార్, అరుణ్, ఆదర్శ్, రాహుల్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న రాజశేఖర్

కాంగ్రెస్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడిగా రవీందర్

నవతెలంగాణ-చొప్పదండి

కాంగ్రెస్ పార్టీ చొప్పదండి మండల కిసాన్ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని దేశాయిపేట గ్రామానికి చెందిన పెరుమాండ్ల రవీందర్ నియామకమయ్యారు. కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చుప్ప శ్రీనివాసులను నియమించినట్లుగా మంగళవారం నియామకపత్రాలను కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అందజేశారు. కార్యక్రమంలో గుమ్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు మునిగాల రాజేందర్ పాల్గొన్నారు.


నియామక పత్రాన్ని అందజేస్తున్న సత్యం

అందరికీ అండగా ఉంటా..

కాంగ్రెస్ హుజురాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రణవ్‌బాబు

నవతెలంగాణ-వీణవంక

అందరికీ అండగా ఉంటానని, ఎవరికీ భయపడొద్దని.. అందరూ ధైర్యంగా ఉండాలని హుజురాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన వీణవంక మండలంలోని బ్రాహ్మణపల్లి, మల్లన్నపల్లి, ఘన్ముక్ల, కిష్టంపేట, మల్లారెడ్డిపల్లి, దేశాయిపల్లి, గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ హామీలను అర్హులందరికీ అందేలా చూస్తానన్నారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ప్రణవ్ బాబు ఓటర్లను కోరారు.


ప్రణవ్ బాబుకు గొర్రెపిల్లను బహూకరిస్తున్న కార్యకర్తలు

బీఆర్ఎస్‌కు ఓటమి ప్రారంభం

-కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్

నవతెలంగాణ-కరీంనగర్

తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి కరీంనగర్ నుంచే ప్రారంభమైందని కరీంనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి (హవేలి) లో ప్రచారం చేపట్టారు. కొత్తపల్లి రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రాచకొండ ప్రభాకర్, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ సాయిని తిరుపతి, జెరిపోతుల వాసు ఆర్టీఐ చైర్మెన్ యూత్ కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా, చిలుక హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పురుమల్ల శ్రీనివాస్

నిత్యావసర సరుకుల పంపిణీ

నవతెలంగాణ-కరీంనగర్

కరీంనగర్ ప్రధాన ఆస్పత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో కరీంనగర్ ఆశ జ్యోతి పాజిటివ్ పీపుల్స్ వెల్ఫేర్ సొసైటీ (కేఏజేపీఎస్+) ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ చేతుల మీదుగా 20 మంది అనాథ పిల్లలకు దాతల ద్వారా పౌష్టికాహారం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ, కేఏజేపీఎస్+ అధ్యక్షురాలు మమతా, సీఎస్సీ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గేదె పొడవడంతో రైతు మృతి

నవతెలంగాణ-వీణవంక

ప్రమాదవశాత్తు ఓ రైతును గేదె పొడవడంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదిగంటి రాజిరెడ్డి (50) అనే రైతు తన కొట్టంలో కట్టేసిన గేదెకు గడ్డి వేసేందుకు దాని దగ్గరకు వెళ్లాడు. దీంతో అది బెదిరి ఆ రైతును పొడవడంతో ప్రమాదవశాత్తు పక్కకున్న బండలపై పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో రాజిరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు.


రాజిరెడ్డి (ఫైల్)

కాంగ్రెస్ అభ్యర్థి మద్దతుగా విద్యా సంఘ నాయకులు

నవతెలంగాణ-ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలంలోని గడ్డివానిపల్లి గ్రామంలో విద్యార్థి నాయకులు అన్నం ప్రవీణ్ బృందం గడపగడుపకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల ప్రచారం నిర్వహించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ, ప్రజా ప్రభుత్వాన్ని నిర్మించే పార్టీ కాంగ్రెస్ పార్టీకీ ప్రజలంతా ముక్త కంఠంతో మద్దతు పలికి హుజురాబాద్ నియోజకవర్గ అభ్యర్థి వొడితల ప్రణవ్‌ని ఆశీర్వదిస్తామన్నారు. గడ్డివానిపల్లి గ్రామ ప్రజల చైతన్యం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని అన్నారు. ఈ కార్యాక్రమంలో విద్యార్థి నాయకులు అన్నం ప్రవీణ్, కారింగుల రాజేందర్, తోడేటి మదు, గందం రవి, ఏబూషి అజయ్, ఇటుకాల గణేష్, పచ్చిమట్ల బాను, పొనగంటి కార్తీక్, ఆకుల సాయి, అవినాష్, శ్రీకాంత్, తోడేటి వినయ్, పైడిమల్ల శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

మేడిపల్లి సత్యంను గెలిపించాలి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-చొప్పదండి

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యంను అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో గడప గడపకు కాంగ్రెస్ పథకాలను విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ముద్దసాని రంగన్న, మునిగాల సుధాకర్‌గౌడ్, మునిగాల రాజేందర్, పెరుమాండ్ల గంగయ్య, తిరుపతి, నెరుమట్ల మోహన్ పాల్గొన్నారు.


రుక్మాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

నవతెలంగాణ-భగత్‌నగర్:

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలని సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు. వెంకటేష్ ఆధ్వర్యంలో పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) డాక్టర్ స్ట్రీట్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పుట్టక ముందు నుంచి చనిపోయిన వరకు ఏదో ఒక చట్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి వస్తుందన్నారు. బాల సదన్ మరియు శిశు గృహంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నైస్ సాధికార సంస్థ సెక్రెటరీ, జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్, బాల సేదన్ శిశు గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

బీఆర్ఎస్‌లో చేరిన కార్యకర్తలు

నవతెలంగాణ-హుజురాబాద్

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హుజురాబాద్, ఇప్పల నర్సింగాపూర్, కాట్రపల్లి, తుమ్మనపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బండ శ్రీనివాస్ పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు సంఘం ఐలయ్య, రాష్ట్ర నాయకుడు వర్థినేని రవీందర్రావు హుజురాబాద్ సింగిల్ విండో అధ్యక్షుడు ఎడవెల్లి కొండల్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులు కొలిపాక సమ్మయ్య కాసగోని కిరణ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండ శ్రీనివాస్

చింతకుంటలో శీనన్నకు ఘన స్వాగతం

నవతెలంగాణ-కొత్తపల్లి

చింతకుంటలో కాంగ్రెస్ అభ్యర్థి పురమల్ల శీనన్న ఎన్నికల ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజలందరికీ వివరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మడుపు మోహన్‌చారి, ఎస్టీ సెల్ శ్రవణ్‌నాయక్, కరీంనగర్ రూరల్ మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ సాయిని తిరుపతి, సీనియర్ నాయకులు కనుకయ్య పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శీనన్న

'కృష్ణవేణి'లో స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ-చొప్పదండి

చొప్పదండి మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి హై స్కూల్లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయుల వేషాధరణలో ఉత్సాహంగా పాల్గొని పాఠాలను బోధించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ లింగారావు, మేడిశం భయ్యా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పాల్గొన్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

నిరుపేద మహిళలకు సౌభాగ్య లక్ష్మి పథకం

నవతెలంగాణ-సైదాపూర్:

అర్హులైన పేద కుటుంబ మహిళలకు సౌభాగ్య లక్ష్మి పథకం బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తుందని మండలంలోని బొమ్మకల్ గ్రామంలో నాయకులు ప్రచారం చేశారు. హుస్నాబాద్ నియెజకవర్గ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రుద్రారపు రాజేంద్రప్రసాద్, సీనియర్ నాయ కులు రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు రుద్రారపు రవితేజ, గ్రామశాఖ అధ్యక్షుడు ఎరుకొండ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ వేముల నారాయణ, మాజీ సర్పంచ్ చిట్టి ప్రకాష్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఓదెలు వార్డు సభ్యులు మొగిలి, సంజీవరెడ్డి, కార్తీక్ పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

న్యాయ విజ్ఞాన సదస్సు

నవతెలంగాణ- హుజురాబాద్

బాలల దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలో గల మాంటెస్సోరి పాఠ శాలలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చట్టాలపై అవగాహన, పిల్లల చదువు కోవడానికి ఉపయోగపడే వివిధ రకాల అంశా లను వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి డీవీ నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ అలేఖ్య, అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు అరుణకుమార్, మరియు న్యాయవాదులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన రోడ్డు

- మరమ్మతులు చేపట్టని అధికారులు
- భయాందోళన చెందుతున్న వాహనదారులు

నవతెలంగాణ-రాయికల్

గతంలో కురిసిన అకాల వర్షాలు, వరదల వల్ల కొన్ని గ్రామాల్లో రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. కొన్ని గ్రామాల్లో రోడ్లకు ఇరు వైపులా గుంతలు ఏర్పడ్డాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ధ్వంసమైన రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదాలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. రాయికల్ మండలంలోని వీరపూర్



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

గ్రామం వద్ద రోడ్డుకు ఓ వైపు బావిని తలపించేలా పెద్ద గుంత ఏర్పడింది. రాయికల్-మైతాపూర్, రాయికల్-రామాజీపేట్ రోడ్ డ్యామ్ వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పాడైపోయిన రోడ్ల మరమ్మతులు, వంతెనల నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఈ విషయం పై రహదారులు, భవనములు శాఖ ఏఈ మధును నవతెలంగాణ వివరణ కోరగా వీరపూర్ రోడ్డుకు సంబంధించి రూ.98 లక్షల అంచనాతో అగ్రిమెంట్ పూర్తి అయినా సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదని తెలిపారు. మైతాపూర్ గ్రామం వద్ద కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించినప్పటికీ మంజూరు కాలేదని, పట్టణంలోని రెండు రోడ్ డ్యామ్ వంతెనలకు సంబందించిన బకాయి బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారని తెలిపారు.

చింతల చెరువులో మట్టి దొంగలు



మట్టి తరలించిన ప్రదేశం

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని ఇటిక్యాల గ్రామ చింతల చెరువులో జేసీబీతో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్లతో మొరం, మట్టిని తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొందరు జేసీబీ సాయంతో అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కలికోట చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ సన్‌ప్రిత్‌సింగ్

నవతెలంగాణ-కథలాపూర్

మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కలికోట చెక్ పోస్ట్‌ను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళిని జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేస్తామని, నగదు, మద్యం పంపిణీలపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఓటర్లను ప్రలోభాలు పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ఆల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి అవసరం ఉన్న చట్టాలపై కనీస అవగాహనా పెంపొదించు కోవాలన్నారు. కార్యక్రమంలో చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ జి. రాజగోపాల చారి, పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సంజయ్‌కుమార్

నవతెలంగాణ-సారంగాపూర్

తనకు ఓటేసి గెలిపించినందుకు జగిత్యాల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్రంలోనే నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో ఉంచుతానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండల కేంద్రంతో పాటు నాయకపుగూడెం, రేచపల్లి గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద ప్రజల కోసం విద్య వైద్య రంగాలకు పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఇప్పటి వరకు ఎంతో అభివృద్ధి జరిగిందని ఇంకా జరగాల్సి చాలా ఉందన్నారు. సేవ చేస్తారని ఓ పెద్ద మనిషికి పదవిని కట్టబెడితే ఆ పదవీకాలం ఇంకా రెండు సంవత్సరాలు ఉన్నప్పటికీ మళ్లీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

పదవి కావాలని మాయ మాటలతో ప్రజల్లోకి వస్తున్నారని విమర్శించారు. మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, మాజీ మండల అధ్యక్షుడు కాలగిరి బాపురెడ్డి, సారంగాపూర్ సర్పంచ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి, ఎంపీపీ కోల జమున శ్రీనివాస్,వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, జడ్పీటీసీ మేడిపల్లి మనోహర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతి ఓటర్‌కు స్లిప్పు అందేలా చూడాలి



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ జగిత్యాల టౌన్

ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా ప్రణాళికలతో కార్యచరణను జిల్లాలో అమలు పరచాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీ, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించు కోవాలని, దీనికి అవసరమైన మేరకు సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ.. వెబ్ కాస్టింగ్ కోసం జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన 500 మంది విద్యార్థులను వెబ్ కాస్టింగ్ కోసం ప్రతిపాదించామని వారందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం జిల్లాలోని రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటర్లందరికీ ఓటరు స్లీప్‌లు, ఓటరు గైడ్‌లను పంపిణీతో పాటు, సి-విజిల్ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, ఆర్డీఓ రిటర్నింగ్ అధికారులు నరసింహ మూర్తి, రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు దేవరాజ్, నరేష్, ఎన్. భీమ్ కుమార్, ఈడిఎం మమత, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

నవతెలంగాణ-పెగడపల్లి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమౌతుందని ఆ పార్టీ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని రాజారాంపల్లి, ఎల్లాపూర్, కీచులాటపల్లి, రాంభద్రునిపల్లి, ఏడుమోటలపల్లి గ్రామాల్లో కొప్పుల ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోలి శోభ సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లోకనిర్మల మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్,



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

అడ్వైజర్ కమిటీ అధికార ప్రతినిధి ఇరుగురాల ఆనందం, సింగిల్ విండో చైర్మన్ మంత్రి వేణు, సర్పంచులు సత్తెమ్మ, స్వప్న, అంజలి, రాజేశ్వర్‌రావు, ఎంపీటీసీలు రవీందర్, అంజయ్య పాల్గొన్నారు.

రంగు పోయిన జెండాను మార్చేది ఎప్పుడో.?

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో ఏర్పరిచిన అతిపెద్ద జెండా రంగు వెలసిపోయింది. ఈ విషయం అధికారులకు కనబడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు రంగు వెలిసిన జెండాను మార్చి నూతన జెండాను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రంగు వెలిచిన జాతీయ జెండా

కిరాణ షాపులో అగ్ని ప్రమాదం

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలోని అంగడిబజార్ సమీపంలో గల సాహెర కిరాణాలో ప్రమాదశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మంటలు చెలరేగడంతో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులు గ్రహించి దుకాణా యజమాని అబ్దుల్ ఖలీల్‌కు సమాచారం ఇచ్చారు. స్థానికుల సహాయంతో మంటలు ఆర్పి వేశారు. అప్పటికే నిత్యావసర వస్తువులు, సామగ్రి పూర్తిగా కాలి పోయాయి. ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడు కుంటున్నాడు.



కాలిపోయిన సామగ్రి

మిర్చి బజ్జీలు వేసి జువ్వాడి ప్రచారం



బజ్జీలు వేస్తున్న జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగ్‌రావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అందించే ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా హోటల్‌లో బజ్జీలు వేసి నాయకులు, కార్యకర్తలను ఉత్సహపరిచారు. ఈ ప్రచార కార్యక్రమంలో కౌన్సిలర్ యామ రాజయ్య, న్యాయవాది, కోమిరెడ్డి లింగారెడ్డి, ఎర్రోళ్ల హనుమండ్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్‌తోనే న్యాయం

నవతెలంగాణ-పెగడపల్లి

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పెగడపల్లి మండల పరిధిలోని బతికే పెల్లి, లింగాపూర్, దోమలకుంట గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్య క్రమాన్ని నిర్వహించారు. పలువురు యువకులు గ్రామస్తులు లక్ష్మణ్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములుగౌడ్, ఉపా ధ్యక్షుడు సంధి మల్లారెడ్డి,తడగొండ రాజు, ప్రధాన కార్యదర్శి గోగురి సతీష్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్,లింగాపూర్, పార్టీ సీనియర్ నాయకుడు గజ్జల స్వామి, బతికేపెల్లి, ఏడు మోటలపల్లి సర్పంచ్‌లు శంకర్, శోభారాణి, రవి నాయక్,ఎంపీటీసీ శోభ తిరుపతి, సింగిల్ విండో మాజీ చైర్మన్ అమ్మిరిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ

నవతెలంగాణ-సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంగళవారం రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ జిల్లాలోని అంకిరెడ్డిపల్లి, నేరెళ్ల, నాంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తప్పకుండా రైతుల కోసం కనీస వసతులైన తాగు నీరు, చలవ పందిళ్లు, కూర్చోడానికి కుర్చీలూ లేదా బెంచీలు అందు బాటులో ఉండేలా చూడాలన్నారు. రైతులకు తొందరగా ధాన్యం డబ్బులు క్రెడిట్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. రగుడు లోని శ్రీవేంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్ మిల్‌లో తనిఖీలో భాగంగా ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం తొందరగా అందచేయాలని లేని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్


అధికారులతో సమావేశమైన పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్

అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యం వెంట వెంటనే అందచేయాలన్నారు. మిల్లర్లకు ఈ వానాకాలం 2023-24 వరి ధాన్యం దిగుమతి చేసుకోవడానికి స్థలం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్. జితేందర్ రెడ్డి , జిల్లా మేనేజర్ జితేంద్ర ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నక్క శ్రీనివాస్, మిల్లర్ల సంఘం అధ్యక్షులు చేపురి నాగరాజు, పబ్బా నాగరాజు, మిల్లర్లు డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తంగళ్ళపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని సదుపా యాలను ఏర్పాటు చేయాలని సివిల్ సప్లై కమిషనర్ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని నేరెళ్ల ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అనిల్‌కుమార్‌తో పాటు సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జనరల్ మేనేజర్ రాజిరెడ్డిలు మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమములో పాక్స్ చైర్మెన్ కోడూరి భాస్కర్ గౌడ్, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, జితేంద్రప్రసాద్, పాపారావు, పాక్స్ డైరెక్టర్స్ రవీందర్‌రావు, అబ్బడి అనిల్‌రెడ్డి, రాజయ్య సీఈవో అజయ్, ఇన్‌చార్జి రాజు, పాల్గొన్నారు.

బాలల దినోత్సవం

నవతెలంగాణ-తంగళ్ళపల్లి: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. వేర్వేరు జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఓడించాలి

నవతెలంగాణ-చందుర్తి: బీఆర్ఎస్‌ను ఓడించాలని సీపీఐ నాయకులు కదారి రాములు అన్నారు. మంగళవారం మండలంలోని బండపల్లి గ్రామంలో కాంగ్రెస్ తరుపున ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు అన్యాయమే జరిగిందని అన్నారు.

మార్నింగ్ వాకర్స్‌ను కలిసిన చల్మెడ

నవతెలంగాణ- వేములవాడ

వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మార్నింగ్ వాకర్స్‌ను మంగళవారం వేకువజామున బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు కలిశారు. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ మాట్లాడుతూ ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్స్, వ్యాయమ పరికరాలు సరిగ్గా లేవని, మహిళలకు ప్రత్యేక ట్రాక్ ఉంటే బాగుంటుందని చల్మెడ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, బీఆర్ఎస్ రూరల్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, గజానంద రావు, నరాల దేవేందర్, గోపు బాలరాజు, గూడూరి మధు, ముప్పిడి శ్రీనివాస్, వాకర్స్ బూర సదానందం ఉన్నారు.


వాకర్స్‌తో మాట్లాడుతున్న చల్మెడ

మోసపూరిత మాటలు నమ్మి గోసపడొద్దు..

- బీఆర్ఎస ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ

నవతెలంగాణ-వేములవాడ రూరల్:

అమలు కానీ హామీలు ఇచ్చే పార్టీలను నమ్మి మోసపోయి, గోసపడొద్దని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్, తుర్కాషి నగర్, నమిలిగుండు పల్లి గ్రామాల్లో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవ రెడ్డి, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డిలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వేములవాడ రూరల్ మండలం నమిలి గుండు పల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, జడ్పీ చైర్పర్సన్ అరుణ-రాఘవరెడ్డిలు మంగళవారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ప్రచారంలో మాట్లాడుతున్న చల్మెడ

గ్రామ గ్రామాన కాంగ్రెస్‌కు నీరాజనాలు

నవతెలంగాణ-ఇల్లంతకుంట:

మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్య నారాయణకు జననీరాజనం పలు కుతూ పలుకుతున్నారు. మండలంలోని అనంతగిరి, దాచారం, అనంతరం గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు రాఘవరెడ్డి, రమణారెడ్డి, ఐలయ్య యాదవ్, రాజేందర్‌రెడ్డి, వెంకట్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


కవ్వంపెల్లికి స్వాగతం పలుకుతున్న ఓటర్లు

ఇల్లంతకుంటలో పోలీస్‌స్టేషన్ తనిఖీ

నవతెలంగాణ- ఇల్లంతకకుంట

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా రెట్టించి న ఉత్సాహంతో పనిచేయాలన్నారు. సోషల్ మీడియా వేదికగా వర్గాల మధ్య, వ్యక్తుల మధ్య అల్లర్లు సృష్టించే వారిపై, సోషల్ మీడియాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై ప్రత్యేక నజర్ పెట్టాలని పోలీసులను ఆదేశించారు. డిఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్ ఉన్నారు.


పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రారంభమైన ఓటర్ సమాచార స్లీప్‌ల పంపిణీ

నవతెలంగాణ-సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నవంబర్ 13వ తేదీ నుంచి ఓటరు సమాచార స్లిప్పులను బూత్ లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. నవంబర్ 30వ తేదీన అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ ప్రక్రియ ప్రారంభించారు. ఓటరు సమాచార స్లిప్పులను కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేసేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పర్యవేక్షణ చేస్తున్నారు. తమ బూత్ పరిధిలో బీఎల్వో ఓటర్ స్లిప్‌ను నమోదిత ఓటరుకు లేదా ఓటరు కుటుంబం లోని వయోజన సభ్యుడికి అందజేస్తున్నారు. బీఎల్వో ఓటర్ స్లిప్‌ను స్వీకరించినందుకు రసీ దుగా, రిజిస్టర్‌లో ఓటర్ స్లిప్ పంపిణీ చేయబడిన వ్యక్తి యొక్క సంతకం లేదా బొటనవేలు ముద్రను తీసుకుంటున్నారు. ఓటరు స్లీప్‌తో పాటు సీ-విజిల్ పాంప్లెట్‌ను ఓటరుకు అందజేస్తున్నారు. అలాగే ప్రతి కుటుంబానికి ఓటరు గైడ్‌ను కూడా అంద జేస్తున్నారు. సెక్టార్ పరిధిలో ఓటరు స్లిప్‌లు ప్రతి ఓటరుకు అందేలా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.


చందుర్తిలో మాట్లాడుతున్న సీడీపీవో ఎల్లయ్య

నవతెలంగాణ-చందుర్తి: ప్రతి ఒక్కరికి ఓటర్ స్లిప్ అందజేయాలని సీడీపీవో ఎల్లయ్య అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో బూత్ లేవల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించే విధంగా చూడాలని తెలిపారు. ఎంపీడీవో రవీందర్ ఉన్నారు.

సమాజంలో డ్రైవర్ల పాత్ర కీలకం

నవతెలంగాణ-సిరిసిల్ల

సమాజంలో ప్రధాన పాత్ర పోషించేది డ్రైవర్లేనని, సరియైన గుర్తింపు లేక వారు కనుమరుగవుతున్నారని హిందూ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు, సిరిసిల్ల ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి పత్తిపాక సురేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్లో డ్రైవర్ అన్నా... నేను మీకున్నా.. అనే కార్యక్రమం ద్వారా జిల్లాలోని డ్రైవర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తనను ఆశీర్వదిస్తే ఆందుబాటులో ఉంటూ, డ్రైవర్‌కు అన్ని రకాల సంక్షేమ పథకాలు తీసుకు వస్తానన్నారు. సిరిసిల్లలో డ్రైవర్లకు కావల్సిన పార్కింగ్ కోసం స్థలం కేటాయిస్తానన్నారు. 25 లక్షల బీమా చేయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డ్రైవర్ యూనియన్ అధ్యక్షులతో పాటు పెద్ద ఎత్తున డ్రైవర్లు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సురేష్

పేదల సంక్షేమమే లక్ష్యం

నవతెలంగాణ-గంభీరావుపేట:

పేదల సంక్షేమమే లక్ష్యంగా బారస ప్రభుత్వం పని చేస్తుందని నాపస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ అన్నారు. మండల పరిధిలోని మంగళవారం సిరిసిల్ల అభ్యర్థి కేటీఆర్ కు మద్దతుగా లింగన్నపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా నాప స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు మాట్లాడుతూ ఇంటింటా ప్రచారంలో భాగంగా కేటీఆర్ కు మద్దతుగా స్థానిక నేతలతో కలిసి ఓట్లను అభ్యర్థించారు. మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధిని స్వాగతిస్తూ తిరిగి వారిని ఆశీర్వదించి మూడవసారి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు


ప్రచారం చేస్తున్న నాయకులు

ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచన

నవతెలంగాణ-సిరిసిల్ల టౌన్:

ఈవీఎంల కమిషన్ ప్రక్రియపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు సూచించారు. మంగళవారం సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వేములవాడలోని స్కూల్‌లో సెక్టార్ అధికారులకు, ఏఈవోలకు కమిషనింగ్ ప్రక్రియపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, మధుసూదన్ ,సిపిఓ పిబి శ్రీనివాసచారి, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ తదితరులు ఉన్నారు.


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ఖోఖో పోటీలకు బొప్పాపూర్ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 29వ తేదీన కరీంనగర్‌లోని సేయింట్ జాన్స్ పాఠశాలలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల ఖోఖో అసోసియేషన్ సబ్ జూనియర్ అండర్ 14 ఖోఖో ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన జడ్పీహెచ్‌ఎస్ రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన శ్రీజ, రిషిత, ఏ. సంయుక్త ముగ్గురు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల15 నుంచి 18 తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలలో కరీంనగర్ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించనున్నారు. వీరిని ఉపాధ్యాయ బృందం, పీఈటీ ప్రభాకర్‌లు అభినందించారు.


ఎంపికైన విద్యార్థినులు

కళాకారులకు జాతీయ అవార్డులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రానికి చెందిన శ్యామంతుల అనిల్, దుంపెన రమేష్ జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ, విశ్వకర్మ గాయత్రి నాట్య కళావేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 10న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వివిధ అవార్డు గ్రహీతలకు విజయవాడలో అందజేయనున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ చీటీ లక్ష్మణ రావు, సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నేవూరి వెంకట నరసింహారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


దుంపేన రమేష్, అనిల్

కేటీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

సిరిసిల్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి కేటీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపించడానిక కృషి చేస్తామని కౌండిన్య గౌడ యూత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన కౌండిన్య గౌడ యూత్‌కు చెందిన వందమంది బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో మంగళవారం చేరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి, ఎంపీపీ పిల్లి రేణుక కిషన్, జడ్పీటీసీ చీటీ లక్ష్మణరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవాతెలంగాణ-ఇల్లంతకుంట:

మండల కేంద్రములో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జడ్పీ వైస్ చైర్మన్ వేణు ఆధ్వర్యంలో కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని ఓటర్లను అభ్యర్తించారు. నాయకులు సంజీవ్ ,రవీందర్ రెడ్డి ,వేణు రావు, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఓటర్లను అభ్యర్థిస్తున్న వేణు

మీ అందరి ఆశీస్సులతో తిరిగి గెలుస్తా

▶ రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ

నవతెలంగాణ-గోదావరిఖని:
మీ అందరి ఆశీస్సులతో తిరిగి స్వతంత్ర అభ్యర్థిగా గెలవ బోతున్నానని రామగుండం స్వతంత్ర అభ్యర్థి సోమారపు సత్యనారాయణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన రామగుండం కార్పొరేషన్ 17, 18 డివిజన్లలోని అల్లూరు, హనుమాన్ నగర్, సంతోష్ నగర్‌లో ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వైస్ రాజశేఖర్ రెడ్డి, మహాకూటమి అభ్యర్థి మరొకవైపు, ప్రజారాజ్యం చిరంజీవి గాలి మరోవైపు అయినా కూడా ఇక్కడ ప్రజలు నన్ను స్వతంత్ర అభ్యర్థిగా తనను గెలిపించారని, ఇప్పుడు కూడా మరొక్కసారి మీ అందరి దీవెనలతో గెలుస్తానని, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, గతంలో గెలిచిన ఎమ్మెల్యే అవినీతి, భూకబ్జాలు, నిరుద్యోగులను మోసం చేసి వందల కోట్లు సంపాదించాడని, మరొకవైపు కాంగ్రెస్ అభ్యర్థి నాకు ఒక్కసారి అవ కాశం ఇవ్వండి అంటూ తిరుగుతున్నాడని


ప్రచారం నిర్వహిస్తున్న సోమారపు సత్యనారాయణ

అన్నారు. ఈ కార్యక్రమంలో సోమారపు అరుణ్ లావణ్య, మాజీ మేయర్ రాజమణి, కుసుమ, మాజీ కార్పొరేటర్లు పిడుగు కృష్ణ కోదాటి ప్రవీణ్, వద్దూరి రవి, రవి నాయక్, కిషన్‌రావు, వీరన్న, పత్తి సంజీవ్, సుభాష్, నారాయణ రెడ్డి, కిషోర్, సురేష్, రాకేష్, వాసు, కప, శ్యామ్ రాజ్, రవి, నిఖిల్, యశ్వంత్, ప్రకాష్, సంపత్, రాజు తదితరులున్నారు.

పదోన్నతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పాలకుర్తి మండలం జయ్యారం ఎస్సీ హాస్టల్లో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ వార్డెన్‌గా పదోన్నతి పొందిన రామిడి తిరుపతి పై, పదోన్నతి కల్పించిన అప్పటి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నాగేశ్వర్ పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రిజర్వేషన్ పరిరక్షణ సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షుడు కర్రె రవీందర్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగుల బ్యాక్‌లాగ్ కోటలో వాచ్‌మెన్ ఉద్యోగం పొందిన తిరుపతి నిబంధనలకు విరుద్ధంగా హెచ్‌డబ్ల్యూగా పదోన్నతి పొందాడని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా అధికారులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎక్కిరాల రాజు, జిల్లా అధ్యక్షుడు కల్లాల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు కాంపెల్లి ఆకాష్ కుమార్ పాల్గొన్నారు.

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు : శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మంథని
కేసీఆర్ మాయ మాటలు నమ్మి మళ్ళీ మోసపోవద్దని మంథని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం మంథని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శ్రీధర్‌బాబు ప్రచారం చేశారు. కాళేశ్వర ప్రాజెక్ట్ పేరిట లక్ష కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి 6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంథని నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

ఘనంగా బాలల దినోత్సవం

నవతెలంగాణ-మంథని
జవహర్‌లాల్ నెహ్రూ పుట్టిన రోజును పురస్కరించుకొని జడ్పీహెచ్‌ఎస్ గుంజపడుగు పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వయం పరిపాలన దినోత్సవంగా పాటించి విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి విద్యాబోధన చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శివలీల, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సురేష్, పోచయ్య, సంగీతస్వామి, భూమయ్య, రవీందర్, స్వామి, అపర్ణ, వామన మూర్తి, మాధురిలు పాల్గొన్నారు.


విద్యారులతో ఉపాధ్యాయులు

భూమిలేని ప్రతి కుటుంబానికి ఒక ఎకరం పట్టా ఇస్తాం

▶ బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
బహుజన రాజ్యంలో భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఒక ఎకరం మహిళల పేరిట పట్టాలు ఇస్తామని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష అన్నారు.పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామంలో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష ఎన్నికల ప్రచారంలో భాగంగా గడపగడపకు ప్రచారం నిర్వహించి, బీఎస్పీ మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కాన్షీయువ సర్కార్ ద్వారా యువతకు పదేళ్లలో పది లక్షల ఉద్యోగాలు, బహుజన రైతు భీమా ద్వారా ప్రతి పంటకు కనీస మద్దతు ధర,


బీఎస్పీ పథకాలను వివరిస్తున్న బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష

ధరణి పోర్టల్ రద్దు చేస్తాం అన్నారు. దొడ్డి కొమురయ్య భూమి హక్కు పథకం ద్వారా భూమిలేని ప్రతి పేద కుటుంబానికి ఎకరం భూమి మహిళల పేరిట పట్టా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ మహిళా కన్వీనర్ ఆముదాల అరుణ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎండీ బాబాను పరామర్శించిన కొప్పుల కుమార్తె నందిని


ఎండీ బాబాను పరామర్శిస్తున్న నందిని

నవ తెలంగాణ-ధర్మారం
మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ బాబా గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడగా, అతనిని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ కుమార్తె నందిని స్థానిక ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ బలరామిరెడ్డి జడ్పీటీసీ పూసుకోరి పద్మజాతిన రావు ఏఎంసీ చైర్మన్ కొమటిరెడ్డి బుచ్చిరెడ్డి కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కమిటీ సభ్యుడు పూసుకురి రామారావు బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్ ఎంపీటీసీ తుమ్మల రాంబాబులు పాల్గొన్నారు

యుగ తులసీ పార్టీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ

నవతెలంగాణ-మంథని
మంథని అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ పరిశీలన తర్వాత మిగిలిన అభ్యర్థుల నుంచి యుగ తులసీ పార్టీ అభ్యర్థి సుజిత్ గౌడ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

ఇంటింటి ప్రచారంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ


పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-మంథని
తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ పరిపాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందాయని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు.అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మంథని మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు,పవర్ హౌజ్ కాలనీ, చైతన్యపురి కాలనీ, శ్రీరామ కాలనీల్లో ఇంటింటా ప్రచారం చేసి కారు గుర్తుకు ఓటు వేయాలని,ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్‌ను గెలిపించు కోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను పుట్ట మధూకర్ చేసిన అభివృద్ధి సేవలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు అవుతాయనేవిషయాన్ని ప్రజలు గమనించాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రిలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యా నికేతన్‌లో మంగళవారం జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, నవీన్, స్రవంతిలు పాల్గొన్నారు.


చిల్డ్రన్స్ డే వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా నెహ్రూ135వ జయంతి వేడుకలు


నెహ్రూ జయంతి వేడుకల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రామగిరి
రామగిరి మండలం స్థానిక కల్వచర్లలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో, బేగంపేటలో గల సాయి ప్రగతి విద్యానికేతన్‌లో జవహర్ లాల్ నెహ్రూ 135వ జయంతి వేడుకలని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ప్రీ-ప్రైమరీ పిల్లలు వివిధ వేషాధారణలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్ కుమార్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

నవతెలంగాణ- పెద్దపల్లి
ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పండించిన చివరి గింజ వరకు మద్దతు ధరపై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో, పాలకుర్తి మండలం బసంత్ నగర్, రామారావుపల్లి గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీక్లీనర్లు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ఉపసంహరణ.. బీఆర్ఎస్‌కు మద్దతు

నవతెలంగాణ-మంథని :
మంథని అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన ముత్తారం మండలానికి చెందిన నాగినేని జగదీశ్వర్ రావు తన నామినేషన్ ఉప సంహరించుకున్నట్లు తెలిపారు. మంగళ వారం మంథని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు.రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధూకర్‌కు తాను ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వికలాంగుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాల నేపథ్యంలో తన నామినేషన్ ఉపసంహరించుకొని బీఆర్ఎస్ పార్టీకి స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.


జగదీశ్వర్ రావు

కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కోతలు

నవతెలంగాణ-రామగిరి
కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కోతలు తథ్యమని రామగిరి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శెంకేషి రవీందర్, మండల రైతు సమన్వయ అధ్యక్షుడు మ్యాదరవేన కుమార్ అన్నారు. రత్నాపూర్ రామగిరి ఖిల్లాలో ఉపాధి కూలీలతో సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు ఆధ్వర్యంలో కేసీఆర్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పుట్ట మధూకర్‌ను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ధర్ముల రాజ సంపత్,ధర్ముల శ్యామల, మండల ఇన్‌చార్జ్ మద్దిపాటి శ్రీనివాస రావు, కొమ్ము సుగుణ, వార్డ్ సభ్యులు కెక్కర్ల ఉష అశోక్, రవిలు పాల్గొన్నారు.



అనారోగ్యంతో వృద్ధురాలు మృతి

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండలం ఓడేడు గ్రామానికి చెందిన జంగా పోసాని (85) అనే వృద్ధురాలు అనారోగ్యంతో మంగళ వారం ఉదయం మృతి చెందింది. వృద్ధురాలు కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి 2వేలు సర్పంచ్ సిరికొండ బక్కారావు కుమారుడు వేణుగోపాలరావు దహన సంస్కారాల కార్యక్రమాలకు ఆర్థిక సహాయాన్ని అందించారు.


జంగా పోసాని ఫైల్

నవతెలంగాణ 7
పెద్దపల్లి
బుధవారం | నవంబర్ 15, 2023 | www.navatelangana.com

ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు
అందేలా కట్టుదిట్టమైన కార్యాచరణ

- రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్
- జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి



నవ తెలంగాణ -పెద్దపల్లి

ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్పు అందేలా కట్టుదిట్టమైన కార్యాచరణను అమలు చేయాలని రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి వెబ్ క్యాస్టింగ్ నిర్వహణ, ఓటరు స్లిప్పుల పంపిణీపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. రాష్ట్రసంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహణకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని, దీనికి అవసరమైన మేర యంత్రాంగం సిద్ధం చేసుకోవాలని, స్థానికంగా అందుబాటులో ఉండే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న యువతను వెబ్ క్యాస్టింగ్ కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఓటరు స్లిప్పులు అందలేదని గతంలో అనేక ఫిర్యాదులు ఉన్నాయని, వీటి నివారణ కోసం ఎన్నికల కమిషన్ ముందస్తుగా ఓటరు స్లిప్పుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించిందని, పోలింగ్ కేంద్రాల వారిగా ఓటరు స్లిప్పులు ముద్రణ చేసి వాటి పంపిణీ పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ పర్యవేక్షణ కోసం నోడల్ అధికారిని నియమించాలన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీపై ప్రతి రోజూ నివేదికలు సమర్పించాలని, ప్రతి ఒక్క ఓటరుకు తప్పనిసరిగా ఓటరు స్లిప్పు అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి భూపాలపల్లి జిల్లాలో ఉన్న మండలాలకు ములుగు జిల్లా అని ముద్రణ జరిగిందని, అదే విధంగా పోలింగ్ సమయం సైతం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అని ముద్రించారని, దీనిని సవరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఈడీఎం కవిత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నవతెలంగాణ ఓదెల:



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఓదెల గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి మాజీ వార్డ్ సభ్యులు ఎర్ర స్వామి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ రమణారావు వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.

విజయరమణారావును గెలిపించాలి

తాండ్ర సదానందం

నవతెలంగాణ ఓదెల:



ప్రచారం నిర్వహిస్తున్న సదానందం

ఓదెల మండలంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం జిల్లా నాయకులు వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా తాండ్ర సదానందం మాట్లాడుతూ సీపీఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చింతకుంట విజయ రమణారావును భారీ మెజార్టీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:



వివిధ వేషధారణలో పిల్లలు

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కంఫర్ట్ పాఠశాలలో చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు అన్నకొండ వినయ్ కుమార్, కరస్పాండెంట్ సౌమ్యలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో ఓసీపీ-3 కార్మికుల చేరిక

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట శైలజ

వివిధ పార్టీలకు చెందిన 50 మంది ఓసీపీ-3 సింగరేణి కార్మికులు మంగళవారం 8వ కాలనీ టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆమె కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కండెం సురేష్, బుర్ర ముత్యాలు గౌడ్, కొంగర రవీందర్, కొండ్ర స్టాలిన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలపై అవగాహన

నవతెలంగాణ జూలపల్లి



అవగాహన కల్పిస్తున్న కేడీసీసీ బ్యాంకు అధికారులు

జూలపల్లి మండలం కుమ్మరికుంట గ్రామంలో మంగళవారం రోజున కేడీసీసీ బ్యాంక్ సిబ్బంది అవగాహన సదస్సు ఏర్పాటు చేసి బ్యాంకు వినియోగదారులకు బ్యాంకు ద్వారా క్రాప్ లోన్స్ 7 శాతం వడ్డీ, లాంగ్ టర్మ్ లోన్స్ పై 10.5 శాతం వడ్డీకే రుణాలను అందిస్తున్నామని, ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీలత, సూపర్‌వైజర్ చంద్రారెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ కరుణాకర్‌లు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్‌ని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ సుల్తానాబాద్



పబ్లిక్ టాయిలెట్స్‌ని పరిశీలిస్తున్న కమిషనర్

పట్టణంలోని పలు సులభ్ కాంప్లెక్స్, పబ్లిక్ టాయిలెట్స్‌ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మంగళవారం పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో పబ్లిక్ టాయిలెట్స్‌ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రావణ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఒక్క అవకాశం అనడం సిగ్గుచేటు

- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్



ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని

55ఏండ్లు దేశంలో, రాష్ట్రంలో పాలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏమీ చేయకుండా మళ్లీ ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని అడగడం సిగ్గు చేటని మంథని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం మల్హర్‌రావు మండలంలోని పలు గ్రామాల్లో భూపాలపల్లి జిల్లా చైర్‌పర్సన్ జక్కు శ్రీ హర్షిణి రాకేష్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఎన్నికల మ్యానిఫెస్టోతో పాటు తన సొంత మ్యానిఫెస్టోను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నాలుగేండ్లలో అనేక అభివృద్ధి పనులు చేశానని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాలను మీ గడపకు చేర్చానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌లు అబద్ధపు మాటలతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి 24గంటల కరెంటు ఇస్తుంటే రేవంత్‌రెడ్డి మాత్రం మూడు గంటలు చాలని, అందుకు మోటార్ల పనితీరుతో లెక్కలు వేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోరే తనను ఆదరించి ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ ప్రాంతంలోని ప్రతి పేద కుటుంబానికి భరోసా కల్పిస్తానని, ప్రతిపేదింటి ఆడబిడ్డ పెండ్లి, విద్యార్థు ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌లో హాస్టల్ వసతితో పాటు గృహలక్ష్మిపథకం ద్వారా ఇండ్లు మంజూరీ చేయించి మూడు లక్షలతో పాటు తాను కొంత సాయం చేసి ఇంటి నిర్మాణం చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. తాను ఇచ్చిన మాటను ఏనాడు తప్పలేదని, మాటకు కట్టుబడి పని చేస్తానని, అబద్దాలు నమ్మి మోసపోకుండా మీ బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి

నవతెలంగాణ-రామగిరి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

రామగిరి మండలం పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని యువత కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి మంథని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట రైతుబంధు నాయకులు మేదరవేణి కుమార్ యాదవ్, అల్లం తిరుపతి, పన్నూర్ ఉప సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బాల సదనం భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్



చిన్నారులతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ - పెద్దపల్లి

జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లిలో నిర్మించిన బాల సదనం భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. బాలల దినోత్సవం నాడు బాల సదనం ప్రారంభించడం సంతోషకరమని, ఇందులో అనాధలు, పాక్షిక అనాధలకు, రక్షణ, సంరక్షణ అవసరమైనటువంటి 6 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు ఆడపిల్లలకు వసతి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ సుగుణ, సీడీపీవో పెద్దపల్లి కవిత, సీడీపీవో మంథని పద్మ, డీసీపీవో కమలాకర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్స్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

దాసరి గెలుపు పై కోసం ప్రచారం



నవతెలంగాణ సుల్తానాబాద్

పెద్దపెల్లి బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని సుల్తానాబాద్ పట్టణంలోని కౌన్సిలర్ మమత సంపత్ వార్డులో ప్రచారాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పాపని సురేష్, యూత్ అధ్యక్షుడు బల్ల ప్రశాంత్, చెట్టి రవి, అదెర్ల రాయమల్లు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



నవ తెలంగాణ-సుల్తానాబాద్

స్థానిక వివేకానంద పాఠశాలలో జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించి, విద్యార్థులచే కేక్ కట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ రవీందర్ కరస్పాండెంట్ సుజాత హాజరై నేటి బాలలే రేపటి పౌరులని, మీరందరూ మంచి మార్గంలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ చందు అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ బలరాం రెడ్డి

నవ తెలంగాణ- ధర్మారం

మండలంలోని పైడి చింతలపల్లి, గురుపల్లి గ్రామాలలో మంగళవారం రోజున ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ బలరాం రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ తరఫున కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని కాపాడుకోవాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ చొప్పరి స్వరూప- కుమార్, గ్రామ శాఖ అధ్యక్షుడు బీసగాని తిరుపతి, జంజిరాల చంద్రమోగిలి, మాజీ ఎంపీపీ పాక మల్లీశ్వరి -వెంకటేశం, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

సహకార వారోత్సవాల పోస్టర్‌ను
ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

నవ తెలంగాణ - పెద్దపల్లి

నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో 70వ అఖిల భారత సహకార వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ భారతదేశాన్ని 5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల కొరకు తయారు చేయడంలో సహకార సంస్థల పాత అనే ముఖ్యమైన అంశంతో సహకార వారోత్సవాలను నవంబర్ 14 నుంచి నవంబర్ 20 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి సి.శ్రీమాల, అసిస్టెంట్ రిజిస్ట్రర్లు ఎస్.వెంకటేశ్వర్లు, పి.సువర్ణ, కె.అనూషలు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌వి మోసపూరిత మాటలు

శాతవాహన యూనివర్సిటీ జేఏసీ చైర్మన్ చైతన్య

నవతెలంగాణ-హుజురాబాద్

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌వి మోసపూరిత మాటలు అని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చేన్నమల్ల చైతన్య అన్నారు. మంగళవారం హుజూరాబాద్ సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ఉప ఎన్నికల్లో ఈటల రాజేందర్ ప్రజలకు సెంటిమెంటు మాటలు చెప్పి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని కానీ ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గం పర్యటించిన పాపాన పోలేదని అన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త నడుం బిగించి కష్టపడి రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎస్సీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ బిఆర్ఎస్, జేఏసీ నాయకులు శనిగరం అరుణ్ కుమార్, గడ్డమీద రాజశేఖర్, కుందేటి సత్య నారా యణ, మహిపాల్‌రెడ్డి, ములుకల విజయ్, రాగుల వినయ్, బండ అశోక్, అభిలాష్, మిర్యాల తిరుపతి, నరేష్, బండారి వెంకటేష్, అభి షేక్ పాల్గొన్నారు.

ప్రచార రథాన్ని సీజ్ చేయడం బాధాకరం

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రామస్వామి

నవతెలంగాణ-జమ్మికుంట


ఓటు వేయాలని అడుగుతున్న బీఎస్పీ అభ్యర్థి

అన్ని అనుమతులు ఉన్న కూడా సౌండ్ ఎక్కువగా వస్తుందని కారణం లో వాహనాన్ని సీజ్ చేయడం బాధాకరమని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వాసాల రామస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనాల మీద బిఎస్పి పార్టీ నాయకులు ప్రచారం చేయొద్దనే కక్షతో సీజ్ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి పల్లె ప్రశాంత్‌గౌడ్ ఇంటింటికీ తిరుగుతూ ఏనుగు గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వాసాల రామస్వామి ఇల్లంతకుంట మండలం అధ్యక్షుడు మంద శివ శంకర్, వీణవంక మండల అధ్యక్షుడు కొంగల కుమార్ ,రంజిత్, శ్రీనివాస్ ,వెంకటేష్ ,నరేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్

నవతెలంగాణ-కరీంనగర్

విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) డాక్టర్ స్ట్రీట్‌లో సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కే.వెంకటేష్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మనిషి పుట్టక ముందు నుంచి చనిపోయిన తర్వాత కూడా ఏదో ఒక చట్టానికి అనుగుణంగా నడుచుకోవాల్సి వస్తుం దని, విద్యార్థులు వివిధ చట్టాలపై అవగాహన పెంపొందిం చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైస్ సాధికార సంస్థ సెక్రెటరీ, జిల్లా లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ తణుకు మహేష్, బాల సేదన్ శిశు గృహ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య కుల బాంధవులు అందరికీ అండగా ఉంటా..

బిఆర్ఎస్ రామగుండం అభ్యర్థి కోరుకంటి చందర్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటిచందర్

నవతెలంగాణ-గోదావరిఖని:

ఆర్య వైశ్య కుల బాంధవులు అందరికీ అండగా ఉంటానని, ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించి గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. మంగళవారం ఎన్టీపీసీ ఆర్య వైశ్య కుల బంధువులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామగుండం నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో అభివృద్ధిలో ముందు బాగనా ఉంచామని అన్నారు. నియోజకవర్గంలో మెడికల్ కళాశాల ఐటీ పార్క్ సబ్ రిజిస్టర్ కార్యాలయం మంజూరు చేయించామని చెప్పారు. రామగుండం నియోజకవర్గం అభివృద్ధి కోరుకునే ఆర్యవైశ్యకుల బంధవులంతా ఇక్కడ జరిగిన అభివృద్ధిపై చర్చ పెట్టాలన్నారు. ఆర్య వైశ్య కుల బంధువులందరూ ఒక తాటిపైకి వచ్చి ఎన్నికల్లో తమను ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేకరావు, కార్పొరేటర్లు ఎంవి.రమణారెడ్డి, కల్వచర్ల కృష్ణవేణి భూమయ్య, కుమ్మరి శ్రీనివాస్, ఆర్యవైశ్య కుల సంఘం నాయకులున్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సీఆర్.ప్రసన్న కుమార్

నవతెలంగాణ-కరీంనగర్



మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్

పోలింగ్ రోజున స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఓటింగ్ జరగడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని కరీంనగర్, చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్ర ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సీఆర్.ప్రసన్నకుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమంలో జనరల్ అబ్జర్వర్లు డాక్టర్ సీఆర్.ప్రసన్నకుమార్, ఎంఆర్.రవి కుమార్ పాల్గొని మాట్లాడారు. మైక్రో అబ్జర్వర్లకు కేటాయించిన పోలింగ్ కేంద్రంలోని ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని, వారి విధులను పటిష్టంగా నిర్వహిస్తునే పోలింగ్ టీంతో స్నేహ పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ఆరంభం నుంచి ముగిసే వరకు జరిగిన సంఘటనలు అన్ని ఎప్పటికప్పుడు ఆయా నియోజకవర్గాల జనరల్ అబ్జర్వర్లకు తెలియ జేయాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేల సత్పతి మాట్లాడుతూ.. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి కళ్లు, చెవుల లాంటి వారని అన్నారు. గతంలో జరిగిన ఎన్నికలలో హింసాత్మక సంఘటనలు, బెదిరింపులకు పాల్పడడం, నిర్దిష్ట అభ్యర్థికి అనుకూలంగా అసాధారణంగా అధిక ఓటింగ్ జరగడం తదితర వాటి ఆధారంగా క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్స్, వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ, స్టిల్ ఫోటోగ్రఫీ తదితర వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు పద్మావతి, సదానందం, ఎల్డీఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సుభిక్షం

బీఆర్ఎస్ కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్

నవతెలంగాణ-కొత్తపల్లి


గంగులకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

కేసీఆర్ చేతిలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని బీఆర్ఎస్ కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం కొత్తపల్లి మండలం మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గడపగడపకు వెళ్లి ప్రచారం బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపిస్తే మాయమై నాలుగున్నర ఏళ్లుగా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఒక్క రోజు కూడా గ్రామాల ముఖం చూడనటువంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే చేసేదేమీ ఉండదు అని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ దొంగలకు ఓటు వేసి పవిత్రమైన ఓటు వృథా చేసుకోవద్దని అన్నారు. సమైక్య పాలనలో మల్కాపూర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మరోసారి తనని గెలిపిస్తే వచ్చే పదవులతో మీకే సేవ చేస్తానని అన్నారు. పచ్చని తెలంగాణను చూస్తే ఆంధ్రోళ్లకు కంటగింపుగా ఉందని, ఢిల్లీ పార్టీలతో కుమ్మక్కై తెలంగాణను మళ్లీ దోచుకునేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. కొట్లాడి తెచ్చుకున్న కేసీఆర్ చేతుల్లోనే సుభిక్షంగా ఉంటుందని, మోసపోతే గోసపడక తప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాసరపు శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ గొట్టే జ్యోతి పోచయ్య, ఎంపీటీసీ పండుగ గంగమ్మ నర్సయ్య బీఆర్ఎస్ నియోజకవర్గ యువత ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, ఉప సర్పంచ్ కాసారపు గణేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగాధర లక్ష్మయ్య పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి

నవతెలంగాణ-కరీంనగర్


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు శోభారాణి

బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు హనుమాన్ల శోభారాణి అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ..బాలల హక్కులను కాపాడే బాధ్యత కేవలం కమిషన్‌పైనే కాకుండా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలల కోసం జిల్లా స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ పని చేస్తుందని తెలిపారు. కోవిడ్ వల్ల అనాథలైన అనేక మంది చిన్నారులకు ఈ కమిటీ ద్వారా విద్య, వసతి సదుపాయం అందిస్తున్నదని తెలిపారు. ఆపదలో ఉన్న చిన్నారులను కాపాడేందుకు జిల్లాలో చైల్డ్ లైన్ పని చేస్తుందని, 1098కి ఫోన్ చేయడం ద్వారా వారికి సత్వర సహాయం అందుతుందని తెలిపారు. సీడబ్లూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరిగిన పిల్లల ఆలోచన శక్తి పెరుగుతుందని అన్నారు. ఎవరైనా పిల్లలు వేధింపులకు గురవు తున్నట్లు తెలిస్తే బాల రక్ష భవన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి లలితా దేవి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు కళింగ శేఖర్, రాధ, అర్చన, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, డీసీపీఓ శాంత, బాలభవన్ సూపరింటెండెంట్ మంజుల, సఖి అడ్మిన్ లక్ష్మి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ సంపత్, ఏసీడీపీఓ అరవింద పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీపీసీ 46వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-గోదావరిఖని:


కేక్ కట్ చేస్తున్న జీఎం

ఎన్టీపీసీ రామగుండం 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక షాపింగ్ కాంప్లెక్స్ నుండి అడ్మిన్ బిల్డింగ్ వరకు ఉదయం నడకతో కార్యక్రమం ప్రారంభం కాగా, జీఎం అతుల్ కమలాకర్ దేశాయ్ నేతృత్వంలో అన్ని ఇతర జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, ఇతర సీనియర్ అధికారులతో పాటు వారి కుటుంబ సభ్యులతో టౌన్‌షిప్‌లో మార్నింగ్ వాక్ నిర్వహించారు. స్థానిక ఏడియం బిల్డింగ్ వద్ద కార్యక్రమంలో ముఖ్య అతిథి జీఎం జెండాను ఆవిష్కరించారు. తరువాత ఎన్టీపీసీ గీత్ ఆలపించారు. 46వ ఆవిర్భావ దినోత్సవ కేక్ కట్ చేసి, బెలూన్లు వదిలారు. చీఫ్ జనరల్ మేనేజర్ కేదార్ రంజన్ పాండు, ఎన్టీపీసీ పీఎంఐ నుంచి పాటు వర్చువల్ మోడ్ ద్వారా అందరిని ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో జీఎంలు, ఇతర అధికారులు, ఐఎన్టి యుసి జాతీయ ద్వైపాక్షగా కమిటీ సభ్యులు బాబర్ సలీం పాషా, గుర్తింపు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి కొలీపాక మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షులు ఎంజే నాయుడు, కార్యదర్శి సోమలా భూక్య, దీప్తి మహిళా సమితి సభ్యులు సీనియర్ సభ్యులు, యూని యన్, అసోసియేషన్స్ ప్రతినిధులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది పలువురు అధికారులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ

9

జగిత్యాల

బుధవారం | 15 నవంబర్ 2023 | www.navatelangana.com

జువ్వాడి కృష్ణారావు ప్రచారం



సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల మున్సిపాలిటీలో కాంగ్రెస్ సీనియర్ జువ్వాడి కృష్ణారావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటి, నాయకులు బన్న రాజేష్, జాగిలం భాస్కర్, రాజేశం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవం



పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. గాజులపేటలో లయన్స్ క్లబ్ సభ్యులు ప్రజలకు ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, ట్రెజరర్ ఇల్లెందుల శ్రీధర్, సభ్యులు కోటగిరి తిరుమలా చారి,కోట విజయ్‌కుమార్, గట్ల మారుతి, బండిసుధాకర్, గోరుమంతుల సురేందర్, విజయ్, బత్తుల లక్ష్మణ్ అమ్ముల ప్రవీణ్, దాసరి బాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



చికెన్ కొడుతూ ఓటు అభ్యర్థిస్తున్న కూతుబోద్దీన్

నవతెలంగాణ -మెట్‌పల్లి

కోరుట్ల నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ కుమార్‌కు మద్దతుగా పట్టణంలో మైనార్టీ నాయకుడు కూతుబోద్దీన్ కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్ల మహేష్, జెట్టి మారుతి, బర్ల ప్రశాంత్, బర్ల అక్షయ్, నల్ల ఆదర్శ్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో వేసిన గుడిసెలతో సీపీఐకి సంబంధం లేదు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామ శివారు సర్వే నెంబరు 437లో భూపట్టాలు ఇస్తామని గుడిసెలు వేయించడంలో సీపీఐకి ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెన్న సురేష్ అన్నారు. పట్టణ శాఖ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కోరుకంటి శ్రీనివాస్, సిపిఐ నాయకులు శ్రీగాధ దేవదాసు, వెన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



జగిత్యాలలో..



మేడిపల్లి: పాల్గొన్న విద్యార్థులు



మల్యాల మండలంలో...

నవతెలంగాణ-రాయికల్

మండలంలోని మైతాపూర్, ఇటిక్యాల, ఒడ్డెలింగాపూర్, రాయికల్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మలత, రమాదేవి, పార్వతమ్మ, ఉమాదేవి, సుజాత, అనురాధ, సువర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల : కోరుట్ల పటట్టణంలోని లిటిల్ జీనియస్ స్కూల్‌లో మంగళవారం ఘనంగా బాలల దినో త్సవం నిర్వహించారు. బాలబాలికలు కలర్‌ఫుల్ దుస్తులతో ఆకరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్ రాధా కృష్ణ, ఉపాధ్యాయులు వినోద, రాజు, కటుకం శంకర్ పాల్గొన్నారు.

లాస్య పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు

మల్యాల:మండలంలోని లాస్య పాఠశాలలో బాలల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అకట్టుకున్నాయి. విద్యార్థులు ఉపాధ్యా యుల పాత్రలను అనుకరిస్తూ, పాఠాలను బోధిం చడం జరిగింది. ఈ కార్య క్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ 'రాజు'సార్' ప్రిన్సిపాల్ 'సుష్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి : క్రమశిక్షణతోనే విద్యార్థులకు సామాజిక విజ్ఞానం లభిస్తుందని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్యం నుండే విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో కష్టపడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాల్ని అధిరోహించవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, న్యాయవాదులు గడ్డం శంకర్‌రెడ్డి, బక్కూరి రమేష్, నల్ల రాజేందర్, కోల అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి పట్టణంలోని పలు పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. సరస్వతీ శిశు మందిర్‌లో జరిగిన వేడుకల్లో సరస్వతీ విద్యా పీఠం జగిత్యాల జిల్లా సహ కార్యదర్శి గుంటుక గంగాధర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు,తల్లితండ్రులు పాల్గొన్నారు.

జగిత్యాలటౌన్:జగిత్యాల పట్టణంలోని జ్యోతి హై స్కూల్, ఐఐటీ అకాడమీలో బాలల దినోత్సవం మంగళవారం నిర్వహించారు. డైరెక్టర్ బియ్యాల హారి చరణ రావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేసిన నృత్యాలు అకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మైనార్టీ వెల్ఫేర్ గర్ల్స్ స్కూల్, కాలేజ్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆడేపు భాస్కర్ పాల్గొని మాట్లాడారు. పిల్లల హక్కులను ఎవరైనా కాల రాస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి హరీష్, సీడీపీవో వీరలక్ష్మి, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శ్రావణ్, స్కూల్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.



మెట్‌పల్లిలో..

మేడిపల్లి :ఉమ్మడి మేడిపల్లి మండలంలోని కట్లకుంట, పోరుమల్ల, మేడిపల్లి, వల్లంపల్లి, కొండాపూర్, గోవిందారం, వెంకటరావుపేట తదితర గ్రామాలలో అంగన్వాడీ కేంద్రాలలో ఘనంగా బాలల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆల్ఫోర్స్ ఎన్ఎస్‌వీలో..

మల్యాల: మల్యాల ఎక్స్ రోడ్‌లో గల ఆల్ఫోర్స్ ఎన్ఎస్‌వీ పాఠశాలలో బాలదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్‌రెడ్డి పాల్గొని పండిట్ జవహలాల్ నెహ్రూ పటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి చదువు చెప్పారు.

పోలింగ్ సిబ్బంది నియామకం పూర్తి

జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

శాసనసభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బంది కేటాయింపు రెండవ రాండమైజేషన్ పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా తెలిపారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని కోరుట్ల పరిధిలోని 262, జగిత్యాల పరిధిలోని 254, ధర్మపురి పరిధిలోని 216, చొప్పదండి పరిధిలోని 108 , వేములవాడ పరిధిలోని 90 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన 4472 మంది అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఇందులో 1118 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1118 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2236 మంది ఇతర పోలింగ్ సిబ్బంది(ఒపిఒ)లను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, హెచ్. బసవ రాజేంద్ర, వివేకానంద సింగ్, షీల్ ఆశిష్, అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, దివాకర, ఆర్డీఓలు నరసింహ మూర్తి, రాజేశ్వర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నికల ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి



నవతెలంగాణ-సిరిసిల్లటౌన్

అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల నుంచి కంట్రోల్ రూంకు వచ్చే ఎన్నికల ఫిర్యాదులు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై వెంటనే స్పందించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సొన్‌కర్ అన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహులు మంగళవారం సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలోని సమీకత కంట్రోల్ రూమ్, ఎంసీఎంసీ, మీడియా సెంటర్‌ను పరిశీలించారు. వీరితోపాటు కలెక్టర్ అనురాగ జయంతి, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి రామకృష్ణ, ప్రత్యేక అధికారిని స్వప్న, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం, జిల్లా లేబర్ అధికారి రఫీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, చేనేత జౌళిశాఖ జిల్లా అధికారి సాగర్ సాగర్, లైజన్ అధికారి నర్సింహులు ఉన్నారు.

హస్నాబాద్‌లో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-జగిత్యాల టౌన్

జగిత్యాలరూరల్ మండలం హస్నాబాద్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. మొబైల్ మెడికల్ కేర్ యూనిట్, డిపార్ట్మెంట్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబులిటీస్, సీనియర్ సిటిజన్స్ అండ్ ట్రాన్స్ జెండర్స్ పర్సన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ కృష్ణ తేజ, ఫార్మసిస్ట్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం

నవతెలంగాణ-మేడిపల్లి



ఉమ్మడి మేడిపల్లి మండలంలోని దమ్మన్నపేట, మాచాపూర్, వల్లంపల్లి ,కల్వకోట, మేడిపల్లి గ్రామాలలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ నిర్వహించారు. 6 గ్యారంటీ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భీమారం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, మేడిపల్లి మండలం అధ్యక్షుడు ఏనుగు రమేష్ రెడ్డి, గడ్డం జలంధర్‌రెడ్డి, మోత్కరాపేట గ్రామ సర్పంచ్ దుంపేట లక్ష్మీ నరసయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

డయాబెటిక్‌పై అవగాహన

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా మధుమేహంపై మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌చంద్ర అవగాహన కల్పించారు. మోతాదులో ఆహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయటం, యోగ, ధ్యానం, సమతుల్య ఆహర నియమాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ విజయలక్ష్మి, ఏఎన్ఎం గణిత, సరస్వతి, లత, సిహెచ్ఓ దేవన్న పాల్గొన్నారు.

బాల్యం భగవంతుడు ఇచ్చిన అమూల్యమైన వరం

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

నవతెలంగాణ సుల్తానాబాద్



ప్రతి వ్యక్తి అనుభవించే బాల్యం భగవంతునిచ్చిన ఓ అమూల్యమైన వరం లాంటిదని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత వి.నరేం దర్‌రెడ్డి అన్నారు. మంగళ వారం సుల్తానా బాద్‌లోని ఆల్ఫోర్స్ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దేశ మొట్టమొదటి ప్రధాని పండిత్ జవలాల్ నెహ్రూ జన్మదినం రోజున బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారని అన్నారు. ఆయనకు గులాబీలు, పిల్లలంటే అమితమైన ప్రేమ అని అందుకే ఆయన జన్మదినం రోజున బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నవ తెలంగాణ - సుల్తానాబాద్ రూరల్



పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారి శ్రీధర్

సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల,వాటినపల్లి గ్రామంలో గల పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ ఎస్సై విజేందర్, ఆర్ఐ శ్రీవాణి లతోపా టు తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల ద్వారా మెరుగైన సేవలు

నవ తెలంగాణ -సుల్తానాబాద్ రూరల్



జెండా ఆవిష్కరిస్తున్న సీఈఓ రమేష్

సహకార సంఘాల ద్వారా ప్రజలకు రైతులకు మెరుగైన సేవలు లభిస్తు న్నాయని సీఈవోలు సంతోష్ కుమార్, రమేష్,శంకరయ్య, సతీష్, నబీలు పేర్కొన్నారు. నెహ్రూ జయ ంతిని పురస్కరించుకొని సహకార సంఘాలలో పతాక ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం సీఈవోలు మాట్లాడుతు నెహ్రూ స్థాపించిన సహకార వ్యవస్థ నేటి తరంలో రైతు సోదరులకు అందుబాటులో ఉండి అన్ని వ్యాపార లావాదేవీలు సేవ కార్యమాలు చేస్తూ ముందుకు సాగుతూ ఉన్నాయని ప్రవేట్ బ్యాంకులు, కమర్షియల్ బ్యాంకులకు ధీటుగా అన్ని లావాదేవీలు సాగిస్తున్నాయన్నారు.

అక్రమ మద్యంపై కఠిన చర్యలు తప్పవు :సీఐ గురువయ్య

నవతెలంగాణ-మంథని:



చెక్ పోస్ట్ వద్ద పట్టుకున్న మద్యం

అక్రమ మద్యం నిలువలపై కఠిన చర్యలు తప్పవని మంథ ని ఎక్సైజ్ సీఐ గురవయ్య పేర్కొన్నారు. మంథని మండ లంలోని ఎక్లాస్ పూర్ గ్రామం వద్ద ఏర్పాటుచేసిన చెక్ పోస్ట్‌ను పెద్దపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరి ంటిండెంట్ అధికారి మహిపాల్ రెడ్డి సందర్శించి తనిఖీలు చేప ట్టి,అధికారులకు పలు సూచనలు చేసినట్లుగా సీఐ గురవయ్య తెలిపారు. రూటు వాచ్ నిర్వహిస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న యువకుడిని సిబ్బంది పట్టుకున్నట్లు ఆయన వివరించారు.

బాధితురాలికి భరోసా కల్పించిన కందుల సంధ్యారాణి

నవతెలంగాణ-గోదావరిఖని:

కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇబ్బందులను భరించలేక మనస్థాపం చెంది రామగుండం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ప్రియాంక అనే మహిళా హెయిర్ డ్రై తాగి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో సమాచారం అందుకున్న బీజేపీ పార్టీ అభ్యర్థి కందుల సంధ్యారాణి బాధితురాలు ప్రియాంకను కలిసి పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమెకు చేసిన మోసం గురించి అడిగి తెలుసుకున్నారు. అండగా నేనున్నానంటూ భరోసాను కల్పించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. మహిళలకు కనీసం విలువ ఇవ్వని ఇలాంటి నాయకులను రేపటి రోజుల్లో జరిగే ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రామగుండం నియోజకవర్గంలో మహిళలకు ఇబ్బందులు వచ్చిన, అన్యాయం జరిగిన ముందుండి పోరాడుతానని చెప్పారు.

కాంగ్రెస్ మాటలు నమ్మితే బతుకులు ఆగం

▸ రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:

కాంగ్రెస్ మాటలు నమ్మితే బతుకులు ఆగం అవుతాయని, 55 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిందేమి లేదని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. మంగవారం అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... కుందనపల్లి గ్రామస్థులకు యాష్ బూడిద కష్టాలకు కారణం కాంగ్రెస్ పార్టీ అన్నారు. కుందనపల్లి గ్రామాన్ని కార్పోరేషన్‌లో విలీనం చేస్తే అప్పటి ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ దగ్గరకు కుందనపల్లి గ్రామ ప్రజలు వెళ్లి తిరిగి గ్రామపంచాయతీ ఏర్పాటు చేయుంచాలని విన్నవించినా పని జరగలేద న్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మెదటిగా కుందనపల్లి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌కి విన్నవించి తిరిగి గ్రామపంచాయతీ ఏర్పాటు చేయించానన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి ముఖంలో అనందం నిండిందన్నారు. మనకు మంచి చేసిన సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని, కారు గుర్తుకు ఓటు వేసి దీవించాలని అన్నారు. అక్బర్‌నగర్ కుందనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్ర మంలో జడ్పీటీసీ అముల నారాయణ, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్ రావు, నాయకులు గోపు అయిలయ్య, తిరుపతి నాయక్, బోడ్డుపల్లి శ్రీనివాస్, సంపత్ చౌదరి, అలేటీ గణేష్, కోల సంతోష్ గౌడ్, తదితరులున్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న కళాబృందం

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం నియోజకవర్గ పరిధిలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) అరుణశ్రీ ఆదేశాల మేరకు స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన సదస్సు నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం స్వీప్ నోడల్ అధికారి స్వరూప రాణి పాల్గొన్నారు. రామగుండం నియోజకవర్గం పరిధిలో చైతన్య రథంతో కళాజాతర బందం కళాకా రులచే గోదావరిఖనిలోని సీతానగర్, రాంనగర్, వినోద నగర్, మార్కెట్ ఏరియా, హనుమాన్ నగర్, శివాజీ నగర్, చౌరస్తా ఏరియా, విటల్ నగర్, 5ఇంక్లైన్ చౌరస్తా ప్రాంతాల్లో ఓటరు అవగా హన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటు ప్రాధాన్యత గురించి కళాకారులు గేయ,ఆట,పాటలతో ప్రజలకు తెలియజేశారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

కేంద్ర ఎన్నికల అధికారి శ్రీధర



సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల అధికారి

నవతెలంగాణ-ముత్తారం:

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల అధికారి(ఐఏఎస్) శ్రీధర అన్నారు. మంగళవారం ముత్తారం మండలం కేశనపల్లి, పారుపల్లి, శాత్రాజుపల్లి గ్రామాల్లోని 272, 273, 278 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలి ంచారు. గ్రామాల్లో వందశాతం పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు ఉంటే 8125684450కు ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి తహసీల్దార్ రాజేశ్వరి, మంథని సీఐ గడిగొప్పుల సతీష్, ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు, మండల అధికారులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధ్యాపకునికి సన్మానం



సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:

గోదావరిఖనిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ అధ్యాపకులుగా విధులు నిర్వహించిన కలందర్ భాషా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పదోన్నతి పొంది గద్వాల్ డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, పూలమాలలు వేసి, ఘనంగా సన్మాని ంచారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది సుబ్బారావు, రాజేష్, అజయ్, నరేష్, కిరణ్ మై, శ్రీదేవిలు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవ తెలంగాణ-గోదావరిఖని టౌన్:



కేక్ కట్ చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్

భారత దేశ తొలి ప్రధాని జవహార్ లాల్ నెహ్రు జన్మది నాన్ని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలు ఘనం గా జరిగాయి. గోదావరిఖని మార్కండేయ కాలనీ అంగ న్ వాడీ సెంటర్ 4లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



కండువా కప్పి ఆహ్వానిస్తున్న మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

నవతెలంగాణ-గోదావరిఖని:

స్థానిక యంఎన్ గార్డెన్‌లో మాజీ కార్పోరేటర్ మహ్మద్, నస్రీన్ ఆధ్వర్యంలో పలువురు రామ గుండం అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ ఠాకూర్ సమక్షంలో పార్టీలో చేరగా, వారికి ఆయన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వాని ంచా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ప్రాం తంలో పుట్టిన బిడ్డగా నిరంతరం పోరా టం చేస్తున్నానని అన్నారు. రామగుండం ప్రాంత అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ నేతల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై పార్టీ నాయకులు గడప గడపకు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమ లు చేస్తామని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోని పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయ కులు దాసరి చంద్రమౌళి, తీగల సత్యనా రా యణ, కాంగ్రెస్ నాయకులున్నారు.

బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కండువా కప్పి పార్టీ ఆహ్వానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం, కేశనపల్లి గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్య క్షుడు, ముత్తారం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదా నందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయ కులు కోల విజయ్, గాదం శ్రీనివాస్, కొండల్ రెడ్డి, కుక్కల చందు,తదితరులున్నారు.

ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం ఓడేడు గ్రామంలోని ప్రగతి పాఠశాలలో భారత మొదటి ప్రధాని జవహార్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంట్ గాండ్ల మల్లయ్య నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నవతెలంగాణ
కరీంనగర్
బుధవారం | నవంబర్ 15, 2023 | www.navatelangana.com

పాఠశాలలో బాలల దినోత్సవం


కరీంనగర్: అచీవర్స్ పాఠశాలలో..


కరీంనగర్: సెయింట్ పాల్స్‌లో..


కరీంనగర్: మానేరు పాఠశాలలో..


కరీంనగర్: అంగన్వాడీ కేంద్రంలో..

నవతెలంగాణ-కరీంనగర్: స్థానిక కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ముందుగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ వావిలాలపల్లిలోని సెయింట్ పాల్స్ హై స్కూల్‌లో ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు రకరకాల ఆహార పదార్థాలను తయారు చేసుకొని విక్ర యాలు నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. నగరంలోని కోతి రాంపూర్ అంగన్వాడీ కేంద్రంలో బాలల దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ పాకాల శ్యామల, ఆయా నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో గల రిషి ద ప్లే స్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మెన్ కామరుపు చెన్నప్ప మాట్లాడుతూ బాలల జీవితం బానిస జీవితం కాకుండా సమాజాన్ని మేల్కొలపాలని పిలుపునిచ్చారు. స్కూల్ ఇన్‌చార్జి కౌశల్ కామరుపు, అడ్మిన్ రజిత పాల్గొన్నారు. స్థానిక మంకమ్మతోట, భగత్‌నగర్, విద్యానగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థలలో చాచా నెహ్రూ జన్మ దినోత్సవ వేడుకల సందర్భంగా బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. స్థానిక అర్విన్‌ట్రీ పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ది ప్లే స్కూల్ పాఠశాలలో బాలల దినోత్సవం జరుపుకున్నారు. పాఠశాల సెక్రెటరీ రమ దేవి, చైర్మెన్ సుధాకర్‌రావు, ది ప్లే స్కూల్ ప్రిన్సిపాల్ ప్రభాదేవి, ట్రాస్మా అధ్యక్షుడు శేఖర్‌రావు పాల్గొన్నారు.

చిన్నారుల ద్వారా ఆనందం వెల్లువిరుస్తుందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఆల్ఫోర్స్ బాలల సందడి కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంగణాలలో ఏర్పాటు చేసిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుజురాబాద్: ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శాతవాహన, టెట్రా హెడ్రాన్, ఆదర్శ, కేరళ, వీపీఎస్ కృష్ణవేణి మాంటిసోరి విజ్ఞాన్ తదితర పాఠశాలల కరస్పాండెంట్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొత్తపల్లి: రేకుర్తిలోని స్థానిక పారడైజ్ పాఠశాలలో బాలల దినోత్సవం మంగళవారం ఘ నంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాఠశాల చైర్మెన్ డాక్టర్ పి.ఫాతిమా రెడ్డి విచ్చేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అకడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టీ.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఏ.మధు, ఏఓ కే.శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు. కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠ శాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హుజరాబాద్ రూరల్: కరీంనగర్ హైవే తుమ్మనపల్లి శివారులోని ఏకశిల సీబీఎస్‌ఈ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా జరిగాయి. పాఠ శాల డైరెక్టర్ దినేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మణ్, వైస్ ప్రిన్సిపల్ కిరణ్మయి, దూడల నరేష్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చొప్పదండి: చొప్పదండి మండల కేంద్రంలోని వీణాదారి విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానో పాధ్యాయుల తోపాటు ఉపాధ్యాయులు ఆంజనేయులు, మల్లేశం, చంద్ర శేఖర్, మహేందర్, మధుసూదన్, శైలజ ఉన్నారు.


కరీంనగర్: రిషి ద ప్లే స్కూల్‌లో..



కరీంనగర్: అర్విన్‌ట్రీ పాఠశాలలో..


కరీంనగర్: ది ప్లే స్కూల్‌లో..


కరీంనగర్: ఆల్ఫోర్స్ పాఠశాలలో..


కొత్తపల్లి: పారడైజ్ పాఠశాలలో ..


కొత్తపల్లి: సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠవాలలో ..


చొప్పదండి: వీణాదరి పాఠశాలలో..

కేటీఆర్‌కు సవాల్ విసిరిన కేకే మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట: మండలంలోని కోరుట్లపేట గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తూ కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సవాలు విసిరారు. ఎన్నికల్లో మాజీ మంత్రి కేటీఆర్ తాను డబ్బు పంచనని, మద్యం పంచనని పదేపదే చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ మాటకు కేటీఆర్ కట్టుబడి ఉంటే బుధవారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తాను సిద్ధంగా ఉంటానని మంత్రి సవాల్‌ను స్వీకరిస్తే తాను కూడా అక్కడికి రావాలని సవాల్ విసిరారు. కోరుట్లపేట గ్రామానికి చెందిన 40 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో తాడ విజయ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింహాద్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- సిరిసిల్ల జడ్జి ప్రేమలత

నవతెలంగాణ-సిరిసిల్ల రూరల్:


మాట్లాడుతున్న సిరిసిల్ల జడ్జి ప్రేమలత

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సిరిసిల్ల జడ్జి ప్రేమలత అన్నారు. జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సు అధ్వర్యంలో స్థానిక కోర్టులో బాలల దినోత్సవం సందర్భంగా పిల్లల చట్టాల గురించి తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని తెలియజేశారు. బాలల హక్కులను 20 నవంబర్ 1989 లో. ఐక్యరాజ్యసమితిలో 54 ఆర్టికల్స్ తో కూ డిన ఒక తీర్మానాన్ని ఆమోదించారన్నారు. భాస్కర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

భగత్‌నగర్‌లో అవగాహన సదస్సు

నవతెలంగాణ-కరీంనగర్: ఈనెల 14, మంగళవారం ప్రపంచ మధుమేహ దినోత్సవ సందర్భంగా అంబేద్కర్ స్టేడియం భగత్ నగర్‌లో వివిధ అవగాహన సదస్సులు నిర్వహించారు. కరీంనగర్ పట్టణంలో గల అపోలో రిచ్ హాస్పిటల్ కరీంనగర్ మారథాన్ రన్నర్, సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిలు సదస్సులు నిర్వహించారు. అపోలో రీచ్ హాస్పిటల్ పరిపాలన అధికారి డాక్టర్ నాగ సతీష్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి తరలిరావాలి

నవతెలంగాణ-సైదాపూర్: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారానికి భారీగా నాయకులు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు పిలుపునిచ్చారు. అనంతరం సీపీఐ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. వొజ్జ కొమురయ్య, రాజేశం, ఒడ్నాల వెంకటేష్, పుట్ట సంపత్, నలువాల రవి, సమ్మయ్య, శ్రీనివాసు పాల్గొన్నారు.

ప్రతి ఆడబిడ్డకు ఆర్టీసీ ప్రయాణం ఉచితం

నవతెలంగాణ-సైదాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకంలో భాగంగా తెలంగాణలో ప్రతి ఆడబిడ్డకు ఆర్టీసీ ప్రయాణం ఉచితం అని మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు జాలరాజు, మాజీ ఎంపీటీసీ రాజు, సీనియర్ నాయకులు తిరుపతి, కుట్ల రవి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

నవతెలంగాణ-గన్నేరువరం: జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి గంప మహేశ్ కాంగ్రెస్‌కు ఇటీవల రాజీనామా చేశారు. మానకొండూరు నియోజకవర్గం శాసనసభ్యులు డాక్టర్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మంగళ వారం బీఆర్ఎస్‌లో చేరారు. జడ్పీటీసీ మాడుగుల రవీందం`రెడ్డి, మండల అధ్యక్షుడు వెంకన్న, గడ్డం నాగరాజు, గుడెల్లి ఆంజనే యులు, న్యాత సుధాకర్, పుల్లేల సాయి కష్ణ, కూన చంద్రశేఖర్, మధు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

రసమయికి కుల సంఘాల మద్దతు

నవతెలంగాణ-గన్నేరువరం: మండల కేంద్రంలోని కుల సంఘాలు మంగళవారం ఎమ్మెల్యే, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు గంప వెంకన్న, మాజీ జెడ్పిటిసి మన్ మోహన్ రావు, తీగల మోహన్ రెడ్డి, పుల్లెల లక్ష్మణ్, న్యాత సుధాకర్, మీసాల ప్రభాకర్, కూన చంద్ర శేఖర్,గూడూరి సురేష్, సర్పంచులు,ఎంపీటీసీ, అధిక సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిందం కనకయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి డివిజన్ కార్పొరేటర్ సల్ల శారద రవీందర్, డివిజన్ అధ్యక్షుడు జాప శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రైతు సమితి అధ్యక్షులు కంది రామచంద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో బాలల దినోత్సవం

నవతెలంగాణ-జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో మంగళవారం బాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులుగా విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ప్రతిభ కనబరిచిన ఉపాధ్యా యులకు పాఠశాల కరస్పాండెంట్ వై సునీల్ కుమార్ బహుమతులను అందజేశారు.

మానకొండూర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

నవతెలంగాణ-తిమ్మాపూర్: మానకొండూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని మానకొండూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపెల్లి, మహాత్మానగర్, రామకష్ణ కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-తిమ్మాపూర్: మండలంలోని వచ్చునూర్ గ్రామ బీఆర్ఎస్ ఉప సర్పంచ్ అందె రాజమల్లు, వార్డు మెంబర్స్ బిల్లా సంతోష్‌కుమార్, అందె రాజయ్య, డీలర్ ఉప్పులేటి కొండబాబు, రామహనుమన్ నగర్ మాజీ సర్పంచ్ ఈగ లింగయ్య, బీఆర్ఎస్ నాయకులు పండుగపరశురాములు , కుంభం రవి ,వడ్లకొండ రాజ్ కుమార్, బ్రహ్మచారి కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగారావు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

నవతెలంగాణ-జమ్మికుంట: విద్యార్థులు తమ లక్ష్యంతో ముందుకు సాగాలని పట్టణంలోని న్యూ జయభారతి పాఠశాల కరస్పాండెంట్ గూడూరి రఘుపతి రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డయాబెటిస్ స్వీయ నిర్వహణ పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-జమ్మికుంట: డయాబెటిస్ స్వీయ నిర్వహణ అనే పుస్తకాన్ని పట్టణంలోని సంజీవని ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఐఎంఏ హుజురాబాద్, జమ్మికుంట అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ అంకం సుధాకర్, డాక్టర్ ఊడుగుల సురేష్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చిట్టి రెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ముషం సురేష్, డాక్టర్ కిషోర్ కామిశెట్టి ,డాక్టర్ ఊడుగుల అనిత, డాక్టర్ ముషం ప్రణీత, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుస్తేనే అభివద్ధి

నవతెలంగాణ జమ్మికుంట: హుజురాబాద్ నియోజకవర్గంలో అభివద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ అభ్యర్థి ఒడితల ప్రణయ్‌బాబు తల్లి పద్మశ్రీ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు వార్డులలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను ఆమె వేడుకున్నారు. కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.